ఈ ఏడాది ఆరంభంలోనే ఎన్నికల సందడి మొదలైంది. చాలా కాలం నుంచి ఎదురు చూస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది.ఇప్పటికే కార్యరంగం సిద్ధం చేసుకుని వివిధ వర్గాలతో అనేకమంది అభ్యర్థులు ఓటర్లతో మమేకం అవుతూ వస్తున్నారు. 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థుల గడువు ముగియనుండడంతో తిరిగి ఎన్నిక అనివార్యమైంది. ఈసారి టీడీపీతో సహా పెద్ద సంఖ్యలోనే అభ్యర్థులు రంగంలో నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ మేరకు ఎన్నికల్లో నువ్వానేనా అనేటట్టుగా అభ్యర్థులు ఢీకొనబోతున్నారు.

ఎమ్మెల్సీ పోరు



పేరాబత్తుల రాజశేఖర్ (టీడీపీ)



దిడ్ల వీరరాఘవులు (పీడీఎఫ్)



నేటి నుంచే అమలులోకి కోడ్

ఈసారి రంగంలో టీడీపీ అభ్యర్థి

వామపక్షాలతోపాటు మరింతమంది బరిలో

హోరాహోరీ పోటీ తప్పదా ?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో ఎన్నికల 'కోడ్' కూసింది. ఇప్పటికే టీడీపీతో సహ మిగతా పక్షాలు తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు సన్నాహాల్లో ఉన్నాయి. తెలుగుదేశం అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను మూడు నెలల క్రితమే రంగంలోకి దింపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభం నుంచి రాజశేఖర్ తన పని తాను చేసుకుంటూపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి గెలిచేలా చూడాలని ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం జిల్లా స్థాయి నాయకత్వాన్ని ఆదేశించింది. తాజాగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాజశేఖర్ గెలుపు పార్టీకి అత్యవసరమని, ఎక్కడా పొరపాట్లకు, లోటుపాట్లకు తావివ్వద్దని పార్టీ ముఖ్యుల భేటీలో సీఎం చంద్రబాబు సూచనలు జారీ చేశారు. ఇంతకు ముందే పార్టీలో క్రియాశీలకంగా ఉన్న రాజశేఖర్‌ను పట్టభద్రుల నియోజక వర్గం నుంచి పోటీ చేసే వీలుగా మూడు నెలల క్రితమే రంగంలోకి దింపారు. ఓటర్ల నమోదు ఆరంభ దశలోనే ఆయనను ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించేలా పార్టీ ముఖ్యులు చొరవ చూపారు. అన్ని నియోజక వర్గాల్లోను పట్టభద్రుల ఓటర్ల చేరికలో చొరవ తీసుకోవాల్సిందిగా ఉభయగోదావరి జిల్లాల నేతలకు అప్పట్లోనే ఆదేశాలు అందాయి. దీంతో పార్టీ సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి మరీ రాజశేఖర్‌ను పార్టీ కేడర్‌కు పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆయన వివిధ నియోజకవర్గాల్లో ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటూ వస్తు న్నారు. 2019లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అప్పట్లో వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి ఐ.వెంకటేశ్వరరావు గెలుపొందారు. విద్యావేత్త శేషారెడ్డిపై వెంకటేశ్వరరావు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో వీరిద్దరి మధ్య హోరాహోరీగానే పోరు సాగింది. వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి కాకుండా తమకు మద్దతు ఇస్తే అనూహ్యంగా సరైన స్థితిగతులు కల్పిస్తామంటూ మిగతావారంతా పెద్ద ఎత్తున ప్రచారం సాగించారు. అయినప్పటికీ పట్టభద్రుల ఓటర్లు వెంకటేశ్వరరావువైపే మొగ్గుచూపారు. అప్పట్లో తెలుగుదేశం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగకుండా జాగ్రత్తపడింది. ఈసారి కూడా వామ పక్షాల మద్దతుతో తూర్పుగోదావరికి చెందిన దిడ్ల వీరరాఘవులు బరిలోకి దిగుతున్నారు. తాము బలపరిచిన అభ్యర్థి గెలుపొందేలా, ఉమ్మడి నిర్ణయం అమలయ్యేలా వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలో లేనిపక్షానికే ఓటర్ల మొగ్గు ఉంటుందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము బలపరిచిన అభ్యర్థే గెలుపొందుతారన్న ధీమాతో ఉన్నారు. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థులు పోటీకి దిగే అవకాశాలు స్పష్టంగా కనపడుతున్నాయి.

నామినేటెడ్ పోస్టులన్నీ వాయిదా

బుధవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీతో సహా మార్కెట్ కమిటీల ఎన్నిక ప్రక్రియ వరకు అంతా ఎక్కడి కక్కడ గప్‌చుప్. జిల్లావ్యాప్తంగా మార్కెట్ కమిటీలకు తాజాగా రిజర్వేషన్లు ప్రకటించడమే కాకుండా ఎంపిక ప్రక్రియకు అనువుగా జీవో కూడా జారీ అయ్యింది. భీమడోలు, ఉంగుటూరు, కైకలూరు మార్కెట్ కమిటీల చైర్మన్ పదవికి బీసీ మహిళ, కలిదిండి, ఏలూరు, చింతల పూడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఓసీ జనరల్,దెందులూరు మార్కెట్ కమిటీ ఓసీ మహిళకు కేటాయించారు. నూజివీడు మార్కెట్ కమిటీ ఎస్సీ జనరల్, పోలవరం ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయ్యాయి. ఇప్పుడు ఎమ్మెల్సీ షెడ్యూలు విడుదల కావడంతో ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యేంత వరకు మార్కెట్ కమిటీల చైర్మన్ ఎంపిక జరిగే అవకాశమే లేదు.

పురుష ఓటర్లదే ఆధిక్యత

గడిచిన మూడు మాసాలుగా ఓటర్ల జాబితాలో చేరికలు భారీగానే సాగాయి.నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్య నేతలు పట్టుపట్టి మరీ ఓటర్ల చేరికను ప్రోత్సహించారు. గడిచిన నెలన్నరలో ఉభయ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్ల జాబితాలో కేవలం లక్షా 27 వేల మంది నమోదవగా ఆ తదుపరి నియోజకవర్గాల వారీగా సమీక్ష సాగడంతో ఒక్కసారిగా ఈ సంఖ్య ఎక్కడికక్కడ పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓటర్ల సంఖ్య 3 లక్షల 15 వేల 261గా ఉంది. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య లక్షా 83 వేల 734 కాగా మహిళా ఓటర్ల సంఖ్య వీరికంటే తక్కువగా లక్షా 31 వేల 507గా లెక్క తేలింది. పురుష ఓటర్లే గెలుపోటములకు నిర్ణేతలు కాబోతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42,602 మంది ఓటర్లు ఉండగా అదే పశ్చిమ గోదావరిలో 69,884 మంది ఉన్నారు.ఓటర్ల జాబితాలో పట్టభద్రులకు చోటు కల్పించే దిశగా ఏపీ ఎన్జీవోలు కూడా ఒకింత చొరవ చూపారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఏర్పాట్లపై కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

ఏలూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్, థియరీ పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష నిర్వహించారు. ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 33,511 మంది సకాలంలో సంబంధిత పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సుల వేళలను రీషెడ్యూల్ చేయాలి. బస్సుల కండిషన్‌ను ముందుగానే తనిఖీచేయాలని, అదనపు బస్సులను కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. హాల్‌టిక్కెట్ల జారీలో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ఐవో చంద్రశేఖరబాబును కోరారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్షకేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష ముగిసేవరకు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలి. కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్యం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో అన్ని కేంద్రాల వద్ద 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రకటించారు. పరీక్షలు ముగిసేవరకు ఆర్ఐవో కార్యాలయంలో ఫోన్‌నెంబరు 08812-230197తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, కలెక్టరేట్, పోలీసు కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు

షెడ్యూల్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి పశ్చిమ- తూర్పుగోదావరి (ఆరు జిల్లాల) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫె రెన్స్‌లో హాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. ఎన్నికల కోడ్ బుధూరం నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఆరు జిల్లాల్లోను 440 పోలింగ్ కేంద్రాలో పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తాను, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు ఉంటారని, మిగితా ఐదు జిల్లాల డీఆర్వోలు అసిస్టెంట్లుగా ఆయా జిల్లాలో పని చేస్తారన్నారు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, పరిశీలన, ఓట్ల లెక్కింపు ఏలూరు కేంద్రంగా జరుగు తుం దన్నారు. మార్చి 3న కౌంటింగ్ జరుగుతుం దన్నారు. ఏలూరు జిల్లాలో మీడియా సెల్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రాజకీయ పార్టీలు సహక రించాలన్నారు. ఫిబ్రవరి 1న జరగాల్సిన నూతన ఇళ్ల ప్రవేశాల కార్యక్రమాన్ని నిలుపుదల చేస్తున్నా మన్నారు. నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు గ్రాడ్యు యేట్స్ తమ ఓట్లను నమోదు చేయించు కోవచ్చునన్నారు.

నియమావళి ఇలా..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడగనున్నారు. రాజకీయ పార్టీలను కించపరిచే వ్యాఖ్యానాలు చేయరాదు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేయకూడదు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ప్రచారాలు, సభల్లో లౌడ్ స్పీకర్లు వినియో గించరాదు. రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రచారాలు చేయకూడదు. రూ.10 వేలకు మించి నగదు ప్రత్యక్షంగాను, పరోక్షంగా ఎవరి వద్ద ఉండరాదు. ఉంటే ఆ మొత్తాలకు పూర్తి సాక్ష్యాధారాలుండాలి. జీతం మినహా, ఇతర ఏ మొత్తాలను బదిలీ చేయడానికి వీల్లేదు. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశాలకు మీటింగ్‌లకు మనుషుల తరలించ కూడదు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన వారిపై జిల్లా ఎన్నికల అధికారి, జోనల్ అధికారులు, ఎన్నికల పరిశీలకులకు సరైన ఆధారాలుంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



సిల్టు తొలగిస్తున్న దృశ్యం

డ్రెయిన్ల ప్రక్షాళన

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

నూజివీడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): "అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా" ఆంధ్రజ్యోతి నిర్వహించిన సదస్సు నేపథ్యంలో నూజివీడు మున్సిపాల్టీలో మున్సిపల్ అధికారులు, పారిశుద్య మెరుగుదలకు చర్యలు చేపట్టారు. పట్టణంలో ప్రధాన డ్రెయిన్‌లలో పూడిక తొలగింపు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. పొట్టి శ్రీరాముల బొమ్మ సెంటర్, టౌన్ చర్చి రహదారి పక్కనే గల డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, సిల్ట్‌ను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు దగ్గరుండి తొలగింపు చేపట్టారు.

ఆరని చితి మంటలు

భైరవపట్నం అగ్నిప్రమాదంలో చికిత్స పొందుతున్న ఆరుగురిలో ఐదుగురి మృతి



మండవల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని రోజు వారీ కూలీలు.. చెరువులపై కాపలా కాసేపనికి పొట్ట చేతబట్టి ఇక్కడకు వచ్చారు. ఆ రోజు రాత్రి భోజనం ముగించుకుని కబుర్లు చెప్పుకుంటూ గుడిసెలో దోమలు పోయేందుకు అగర్‌బత్తీ వెలిగించారు. ఏం జరిగిందో తెలియకుండానే ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కాలిన గాయాలతో చెల్లా చెదురుగా పడిపోయారు. ఆరు రోజుల క్రితం మండవల్లి మండలం భైరవ పట్నం సమీపంలోని పత్తిపాడు వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారంతా చనిపోతూ వస్తున్నారు. బుధవారం వంశీ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతిచెందిన వారి సంఖ్య ఐదుకి చేరింది. గాయపడిన ఆరుగురిలో ఐదుగురు దుర్మరణం చెందడంతో గ్రామంతో పాటు బంధువుల్లో తీవ్ర విషాదం అలుముకుంది.

ఒక్కడే మిగిలాడు..

కుటుంబమంతా ఒకేచోట ఉండాలని పెళ్లి చేసిన కుమార్తెను సైతం తన దగ్గర ఉంచుకున్నాడు షారుక్ ఖాన్. అయితే చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా చనిపోతున్నారు. గుంటూరులో చికిత్స పొందుతున్న మనవడు విక్కీ మూడు రోజుల క్రితం చనిపోగా కుమార్తె పాప, ఇద్దరు కుమారులు రెండు రోజుల క్రితం చనిపోయారు. అల్లుడు వంశీ బుధవారం చనిపోవడంతో ఆ కుటుంబంలో ఒక్కరే మిగిలారు. కుటుంబ పెద్ద అయిన షారుక్‌ఖాన్ గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తమిళనాడులోని వేలూరులో అత్యాధునిక సేవలు ఉన్న ఆసుపత్రిలో జాయిన్ చేసినప్పటికీ ఇద్దరు కుమారులు కూడా గంటల సమయంలోనే మృతి చెందారు. బతుకు దెరువు కోసం తమిళనాడు నుంచి పొట్టచేత పట్టుకుని వచ్చిన పేద కుటుంబాలను ఈ సంఘటన దుఃఖ సాగరంలో నింపేసింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌లు తమ వంతు ఆర్థికసాయం అందించారు. అధికార యంత్రాంగం పరంగా సాయం అందించిన దాఖలాలు కనిపించడం లేదు.



పర్యటన ఏర్పాట్లపై ఆచంట ఎమ్మెల్యే పితానితో చర్చిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం తదితరులు

రేపు సీఎం పెనుగొండ రాక

» వాసవీ మాత ఆత్మార్పణ దినం.. పెనుగొండలో చంద్రబాబు పూజలు

పెనుగొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 31న సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పెనుగొండ రానున్నారు. నగరేశ్వర, మహిషాసుర మర్ధని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించను న్నారు.పర్యటన ఏర్పాట్లను బుధవారం పశ్చిమ జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, సీఎం సెక్యూరిటీ పర్యవేక్షకులు అడిషనల్ ఏస్పీ రమణ తదితరులు పరిశీలించారు. ఏఎంసీలో నిర్మిస్తున్న హెలిప్యాడ్ కాంక్రీట్ పనులను పరిశీలించి ఆర్అండ్‌బీ అధికారులకు సూచనలు చేశారు. యార్డు ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. నగరేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించారు. ఆలయానికి ఆనుకుని ఉన్న నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో ఈనెల 31న హోమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గోశాలను పరిశుభ్రంగా ఉంచి ముగ్గులతో అలంకరించేలా చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ అధికారిని ఆదేశించారు. వాసవి శాంతి ధామ్ ఋషి గోత్ర సువర్ణ మందిరాన్ని సందర్శించి ఆలయ ట్రస్టీ డాక్టర్ పీఎస్ గోవిందరాజులతో శాంతి ధామ్‌లో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. దేవదాయ శాఖ ఆర్‌జేడీ కె.సుబ్బారావు, ఏఎస్పీ వి.భీమారావు, ఆర్డీవోలు దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో, సర్పంచ్‌లు నక్కా శ్యామల, తహసీల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో టి.ఎస్.మూర్తి, వాసవి ధామ్ సెక్రటరీ కె.రాజా పాల్గొన్నారు.



పెళ్లికి వేళాయె.. -6లో

డిప్యూటేషన్లకు ఇక చెక్ !

వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ

పదుల సంఖ్యలో ఏళ్ల తరబడి విధుల్లో..

డీఎంహెచ్‌వో కార్యాలయం, ఏజెన్సీ ప్రాంతంలోనే పైరవీలు



ఏలూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) :జిల్లా కేంద్రంలోనే ఇంకా చెప్పాలంటే నివాస ప్రాంతానికి సమీపంలోనే, అదీ పొద్దున్నే ఆదరాబాదరాగా క్యారేజీ సర్దుకుని పని ప్రాంతానికి పరుగులు పెట్టాల్సిన హడావుడి లేకుండా తాపీగా విధులకు వెళ్ళిరావచ్చంటే ఏ ఉద్యోగి వదులుకుంటారు ? కౌన్సెలింగ్ విధానంలో ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి జిల్లా కార్యాలయం లేదా మరేదైనా ముఖ్య కార్యాలయానికి బదిలీపై నియమి తులైతే ఎవరికీ అభ్యంతరాలుండవు. కానీ పైరవీలు, ఇతర ప్రలోభాలతో ఆయా కార్యాలయాల్లో డిప్యూటేషన్‌లపై ఏళ్ల తరబడి విధులు నిర్వర్తించే వారిసంఖ్య పదుల్లో ఉండటంతో క్షేత్ర స్థాయిలో పీహెచ్‌సీల్లో రోగులకు ఆయా వైద్య సేవలు అందక తీవ్రవిఘాతం కలుగు తోంది. ఇదే విషయాన్ని గుర్తించిన వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం జారీచేసిన సర్క్యులర్ అమలుకు సాధ్యాసాధ్యాలపై చర్చనీయాంశంగా మారింది.

వైద్యశాఖలో అన్ని విభాగాలకు వర్తించేలా సర్క్యులర్ జారీ

ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు జారీ చేసిన సర్క్యులర్ ఉత్తర్వుల ప్రకారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వైద్యసేవా ట్రస్టు, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీసాక్స్, డ్రగ్స్ కంట్రోల్, ఆయుష్, డీఎంఈ, ప్రజారోగ్యం, ప్రివెంటివ్ మెడిసిన్, ఫార్మసీ, పారా మెడికల్ విభాగాల్లో ఎవరికీ బదిలీలు/ డిప్యూటేషన్లు ఇవ్వవద్దని సంబంధితశాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. జిల్లాకు సంబంధించి డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే దాదాపు 24 మంది ఆయా విభాగాల్లో ఏళ్ల తరబడి డిప్యూటేషన్లపై కొనసాగుతున్నారు. వీరిలో సీనియర్ అసి స్టెంట్లు, ఎంపీహెచ్‌ఈవోలు, ఫార్మసిస్టులు, ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు ఉన్నారు. వాస్తవానికి వీరిని ఆయా పీహెచ్‌సీల నుంచి డిప్యూటేషన్లపై డీఎంహెచ్‌వో కార్యాల యంలో నియమించాల్సిన అవసరం లేకుండానే అందుబాటులో వున్న సిబ్బంది సేవలను విని యోగించుకునే వెసులుబాటు ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ పైరవీలు, కాసులు సమర్పించుకుని దొడ్డిదారిన డిప్యూ టేషన్లు తెచ్చుకుని తిష్ట వేశారని ప్రచారం జరుగుతోంది. ఫలితంగా వారు విధులు నిర్వ ర్తించాల్సిన పీహెచ్‌సీల్లో రోగులకు అందాల్సిన వైద్యసేవలకు విఘాతం కలగడం లేదా మరొకరిపై అదనపు పనిభారం పడటమో సంవత్సరాల తరబడి జరుగుతోంది. నిజంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసి, 1995లోనే శిక్షణలు నిలిపివేసిన మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ (మేల్) ట్రైనింగ్ స్కూలుకోసం నియామకాలు జరిగిన మెడికల్ ఆఫీసర్, ఎంపీ హెచ్‌ఈవోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, స్వీపర్లు, నైట్‌వాచ్‌మెన్ల సేవలను ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నా జిల్లా అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం. ఇక ఏజెన్సీ ప్రాంత పీహెచ్‌సీల్లో దాదాపు 34 మంది డిప్యూటేషన్లపై ఉండగా, ఈ విషయం కనీసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి కూడా తెలియజేయకుండానే ఓ అధికారి ఎడాపెడా డిప్యూటేషన్లు వేసినట్టు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులకు డిప్యూటేషన్లు వేయాలంటే వారి కేడర్‌ను బట్టి మెడికల్ ఆఫీసర్లకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్, సీనియర్ అసిస్టెంట్లు, ఎంపీహెచ్‌ఈవోలు, స్టాఫ్‌నర్సులు వంటి సూపర్‌వైజింగ్ కేడర్ ఉద్యోగులకు రీజనల్ డైరెక్టర్, జిల్లాకేడర్‌లో అయితే డీఎంహెచ్‌వో మాత్రమే స్థానిక అవసరాలను బట్టి తాత్కాలిక ప్రాతిపదికన అమల్లో ఉండేలా అనుమతులిస్తారు. దీనికి విరుద్ధంగా జిల్లాలో దొడ్డిదారిన డిప్యూటేషన్లపై పదులసంఖ్యలో ఉద్యోగులు జిల్లా కార్యాలయం, ఆయా ముఖ్య కార్యాలయాల్లో సీట్లను సంవత్సరాల తరబడి వదలకుండా ఉంటున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యంగా వున్న డిప్యూటేషన్లను రద్దు చేయడానికి, కొత్తగా ఎటువంటి అడ్డదారుల్లో ఎవరికీ అనుమతులు ఇవ్వకుండా కట్టడి చేయడానికి ఈ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు సత్ఫలితాలనిస్తాయో వేచిచూడాలి. ఇకమీదట డిప్యూటేషన్లు అవసరమనుకుంటే ప్రతిపాదనలను రాష్ట్ర కార్యాలయానికి పంపి, ఉన్నతాధికారుల అనుమతితోనే వేయాలని ఆదేశించారు.

ఎంతమంది ఉన్నారో తేలాల్సి ఉంది

డాక్టర్ మాలిని, డీఎంహెచ్‌వో

జిల్లాలో డిప్యూటేషన్లపై ఎంతమంది పని చేస్తున్నారో చూడాల్సి ఉంది. డిప్యూటేషన్లు ఇవ్వవద్దని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు సర్క్యులర్ జారీ చేశారు. దీనిపై గురువారం స్పష్టత వస్తుంది. ఆ తర్వాతే చర్యలు చేపడతాం.

సినిమా గోదావరి


పోడూరులో బావ సినిమా సన్నివేశం చిత్రీకరణ (ఫైల్)

- గోదావరి తీర గ్రామాల్లో సినిమా షూటింగ్‌లు
- సినిమాలకు ప్రత్యేక సెట్టింగ్‌లు
- పలు గ్రామాల్లో ఇళ్లు, మేడలు షూటింగ్‌కు ప్రత్యేకం
- చిత్ర యూనిట్‌కు ఆతిథ్యం
- వందల చిత్రాల షూటింగ్

గోదావరి జిల్లాల వారికి సినిమా ప్రధాన వినోదం. సినిమాను ప్రేమిస్తారు.. నటులను అభిమానిస్తారు. ఈ ప్రాంతంలో సినిమా చిత్రీకరించడం పరిపాటి. గోదావరి తీర ప్రాంత గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల్లో షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతాయి. సినిమా షూటింగ్ చూసేందుకు అనేక మంది తరలి వస్తారు. సినిమా హీరోలు, చిత్ర యూనిట్ కూడా పల్లె వాతావరణానికి ఎంతో ఆకర్షితులై ఎక్కువ రోజులు సినిమా తీసేవారు.


పోడూరులో ఇంటిలో రామయ్య, వీధిలో కృష్ణయ్య సినిమా చిత్రీకరించిన రుద్రరాజు లక్ష్మణరావు భవనం

ఆచంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తీసిన సినిమాలు ఎక్కువ శాతం హిట్స్ ఐదు దశాబ్దాల క్రితమే గోదావరి తీర గ్రామాల్లో గతంలో అనేక సినిమాలు చిత్రీకరించారు. గ్రామంలో ఉన్న పెద్ద కుటుంబాల భవనాన్ని షూటింగ్‌కు ఇవ్వడంతోపాటు వారు వెళ్లే వరకు కూడా ఆతిథ్యం ఇచ్చి గౌరవంగా చూసేవారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణ తగ్గింది. ఒకపక్క పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, మరొకపక్క రెడీమేడ్ సెట్టింగ్‌లతో అధిక శాతం సినిమా చిత్రీకరణ పట్టణాలకే పరిమితమైంది. పోడూరు, పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, యలమంచిలి మండలంలో అనేక సినిమా షూటింగ్‌లు జరిగాయి.

పోడూరులో..

మొదట పోడూరు అంటే సినిమా షూటింగ్‌లకు పెట్టింది పేరు. 1977లో చిరంజీవి హీరోగా ఇంట్లో రామయ్య.. వీధిలో కృష్ణయ్య సినిమా ఎక్కువ రోజులు ఈ ప్రాంతంలోనే చిత్రీకరించారు. గ్రామానికి చెందిన రుద్రరాజు లక్ష్మణరాజు భవనంలో షూటింగ్ జరిగింది. అదే గ్రామంలో ఆర్ఎస్ రాజు నివాసంలో అగ్నివర్షం, కోసూరి పెద్దబ్బాయి రాజు భవనంలో కృష్ణబాబు, ఆర్ఎస్ రాజు నివాసంలో చిట్టెమ్మ, రుద్రరాజు విజయరామరాజు భవనంలో చిలకపచ్చ కాపురం, చేకూరి సూర్యనారాయణ ఇంటి వద్ద కాంచన మాల కేబుల్‌టీవీ సినిమాలతో పాటు చంటి, అగ్ని పుష్పం, దేవత, బావ, వంటి చిత్రాలు పెద్ద హీరోలు, చిన్న హీరోలు సినిమాలు ఈ గ్రామంలోనే చిత్రీకరించారు.

పెనుగొండలో..

పెనుగొండ మండలం ఇలపర్రులో శతమానంభవతి సినిమా షూటింగ్ సుమారు 20 రోజులు పాటు నల్లపరాజు భాస్కరరాజు కుటుంబీకుల భవనంలో షూటింగ్ తీశారు. షూటింగ్ తీసే సమయంలో ఈ ఇంటికి రాఘవరాజు హౌస్ అని పేరు పెట్టారు. 110 సంవత్సరాల ఈ భవనం శతమానంభవతి సినిమాలో అందరిని ఆకట్టుకుంది. ఈ సినిమా కూడా పెద్ద హిట్. అదే ఇంట్లో పలు సినిమాలు చిత్రీకరించారు.

యలమంచిలిలో..

యలమంచిలి మండలం గోదావరి తీర ప్రాంతం కావడంతో చించినాడ గోదావరి ఒడ్డున యలమంచిలి లంక, మేడపాడు, వంటి చోట్ల గతంలో అనేక సినిమాలు తీశారు. అల్లరి రాముడు, సీతారామరాజు గారి అబ్బాయి, సుందరవదన వంటి చిత్రాలు తీశారు. యలమంచిలిలో తాళ్ళూరి చక్రవర్తి భవనంలో సుందరవదన సుబ్బలక్ష్మి మొగుడా సినిమా దాదాపు ఇక్కడ పూర్తి చేశారు.


ఇలపర్రులో శతమానంభవతి సినిమా చిత్రీకరించిన నల్లపరాజు భాస్కరరాజు కుటుంబ సభ్యుల భవనం

ఆచంటలో..

ఆచంటలో ప్రసిద్ధి చెందిన ఆచంటేశ్వరుని ఆలయ ఆవరణలో పలు సినిమా షూటింగ్‌లు జరిగాయి. ఆచంటలో పందెంకోడి, చంటి, కోడేరు గోదావరి తీరంలో పలు సినిమాలు తీశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర మండలంలోని నత్తా రామేశ్వరంలో ఉన్న లండన్ మహరాజ్ ప్యాలెస్‌లో పలు సినిమాలు షూటింగ్‌లు కూడా తీసిన సంఘటనలు ఉన్నాయి. ఇలా గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో సినిమాలు తీసేవారు. అయితే గ్రామీణ ప్రాంత వాతావరణంలో సెట్టింగ్‌ల ఖర్చు లేకుండా సినిమా షూటింగ్‌లు జరిగాయి. చిత్ర నిర్మాతలు, దర్శకులు, సినిమా హీరోలు, పలువురు నటులకు గోదావరి తీర గ్రామాలతో మంచి అనుబంధం ఉంది.

నెట్టింటి నుంచి నట్టింటికి





షార్ట్ ఫిలింతో నటన, దర్శకత్వంలో ప్రతిభ కనబరుస్తున్న యువత

చేతిలో సెల్‌ఫోన్ ఉంటే అందరికీ అరచేతిలో వినోదం చూపిస్తారు. నెట్టింట వైరల్ అయిన షార్ట్ ఫిల్మ్ నట్టింట వినోదం పంచుతోంది. సామాజిక అంశాలు, ప్రేమ, కెరీర్ అంశాలను బుర్రనిండా నింపుకుని సృజనాత్మకత, భావుకతతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చిన్ని కెమెరాతో కొద్ది నిమిషాల నిడివితో పెద్ద సందేశమిచ్చేదే షార్ట్ ఫిలిం. చాలా మంది యువత షార్ట్ ఫిలిం రూపొందించడం కెరీర్‌గా మలుచుకుంటున్నారు. గ్రామీణ యువతతో పాటు ఇంజనీరింగ్ పట్టభద్రులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న యువత సైతం షార్ట్ ఫిల్మ్ రూపొందించడం, నటించడంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రేక్షకులను ఇట్టే ఆకట్టుకుంటున్నారు. సినిమా స్టార్స్ స్థాయిలో షార్ట్ ఫిలిం నటులు కూడా అభిమానులను సంపాదించుకున్నారు.

తణుకు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సినిమాకు ఏమాత్రం తీసిపోనివిధంగా సందేశం ఇచ్చే షార్ట్ ఫిలింపై యువత ఆకర్షితులవుతున్నారు. సినిమాలో నటించాలనే అభిరుచి ఉన్న యువత షార్ట్ ఫిలిం ద్వారా మెరుగైన నటనతో ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. గ్రామం, పట్టణం, నగరం తేడా లేకుండా స్మార్ట్ ఫోన్, నటనపై ఆసక్తి ఉన్నవారు తమ అభిరుచి మేరకు రీల్స్‌ను చేసి వైరల్ చేస్తున్నారు. దానికి కొంత మెరుగైన రీతిలో ఒకరి కంటే ఎక్కువ మంది నటిస్తూ షార్ట్ ఫిలిం రూపొందిస్తున్నారు.

ఆదాయం.. అవకాశం..

షార్ట్ ఫిలిం యువతకు అవకాశాలతో పాటు ఆదాయం కూడా ఇస్తోంది. కొందరు అభిరుచితో చిత్రాలు రూపొందిస్తే మరి కొందరు ఆదాయ వనరుగా చూస్తున్నారు. యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తే వీక్షకుల సంఖ్య ఆధారంగా ఆదాయం వస్తోంది. వివిధ కంపెనీలు ఫిలిం మధ్యలో ప్రసారం చేసే యాడ్‌ల ఆధారంగా కూడా ఆదాయం వస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

ప్రస్తుతం సినిమా రంగం చాలా ఖరీదైన వినోద సాధనమైంది. వెండి తెరపై నటులుగా వెలుగొందాలనుకునే యువత వ్యయ ప్రయాసలు తట్టుకోవాల్సిందే. వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవకాశాలు కల్పిస్తోంది. చేతిలో సెల్‌ఫోన్‌తో అద్భుతాలు ఆవిష్కరిస్తు న్నారు. 2, 3 గంటల సినిమా సగటు ప్రేక్షకుడు భారంగా భావిస్తున్న తరుణంలో షార్ట్ ఫిలిం అర చేతిలో వినోదంగా మారింది. ప్రతిభావం తులకు ప్రేక్షకుల అభిరుచి కలిసి వచ్చింది. 20 నుంచి 30 నిముషాల నిడివి ఉండే షార్ట్ ఫిలిం యూట్యూబ్ వేదికగా ప్రేక్షకుల చేతిలో ఉంచుతున్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వీక్షించే సౌలభ్యంతో ప్రేక్షకాదరణ బాగానే ఉంది.

ఔత్సాహికులకు వేదిక

సినిమా, టీవీ రంగాలలో నటులుగా ఎదగాలనుకునే వారికి షార్ట్ ఫిలిం ఒక వేదికగా ఉంది. దర్శకత్వం, హీరో, హీరోయిన్, విలన్, ఇతర క్యారెక్టర్ ఆర్టిస్టులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఒక్కో షార్ట్ ఫిలింలో 10 నుంచి 20 మంది ఆర్టిస్ట్‌లు వుంటారు. ఎక్కు వగా సినిమా రంగంలో వివిధ క్యారెక్టర్ ఆర్టిస్టు లుగా వున్న వారి కుటుంబాలకు చెందిన వారు, వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో పదవీ విరమణ చేసిన వారు, చిరు వ్యాపారులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. షార్ట్ ఫిలింలో నైపుణ్యం కనబరిస్తే సినిమా, టీవీ రంగాలలో అవకాశాలు పొందుతున్నారు. అంతేకాదు షార్ట్ ఫిలింతో యూట్యూబ్ వేదికగా పేరు ప్రఖ్యాతులు, ఆదాయం కూడా పొందుతున్నారు. కొందరు ఎటువంటి పారితోషికం లేకుండానే షార్ట్ ఫిలిం వేదికగా ప్రతిభ కనబరుస్తున్నారు.

గోదావరి జిల్లాల్లో బిజీ బిజీ

షార్ట్ ఫిలిం రూపొందించడంలో ఉమ్మడి గోదావరి జిల్లాలో అనేక మంది బిజీగా వున్నారు. వారి వద్ద ఉన్న ఫోన్‌తో ఇక్కడ పరిసరాలు, ప్రకృతి అందాల మధ్య చిత్రీకరణ చేస్తున్నారు. ఇక్కడ రూపొందించిన కొన్ని షార్ట్ ఫిలింలు యూ ట్యూబ్ వేదిక మంచి ప్రజాదరణ పొందాయని దర్శకులు చెబుతున్నారు. వాటిలో ప్రేమ ఇతివృత్తంగా తీసిన క్రష్, తండ్రి కూతురి మధ్య అనుబంధం తెలిపే 'అమ్మాయి మదిలో' ఏమీ పట్టించుకోని కొడుకు ఉదంతం తెలిపే 'బాధ్యత' సమాజంలో నిరుద్యోగ సమస్యపై 'నిరుద్యోగి' స్నేహ బంధాలను తెలిపే 'రుణ పాశం', 'దోస్తీ' '20 రూపాయలు' వంటి షార్ట్ ఫిల్మ్‌లు నెట్టింట ప్రేక్షకాదరణ పొందాయి.


షార్ట్ ఫిలిం సన్నివేశం చిత్రీకరణ

ప్రతిభకు పట్టం



సినిమా రంగంలో అవకాశాలు వెతుక్కునే యువత ప్రతిభకు పట్టం కట్టే వేదిక షార్ట్ ఫిలిం. తెలుగులో ప్రస్తుతం షార్ట్ ఫిలిం ఎక్కువ ప్రాచుర్యం పొందింది. అనేక మంది యువత ప్రతిభ వెలుగులోకి వస్తోంది. సినిమా నిర్మాణానికి భారీ పెట్టుబడి, భారీ యంత్రాలు అవసరం. కానీ షార్ట్ ఫిలింకు ఐ ఫోన్, ఆండ్రాయిట్ ఫోన్ ఉంటే చాలు. ఫోన్‌తోనే చాలా మంది షార్ట్ ఫిలిం రూపొందిస్తున్నారు.

అన్ని పాత్రలు పోషించా...



ఇప్పటి వరకూ 50 షార్ట్ ఫిలిమ్స్‌లో నటించా. దాదాపు అన్ని పాత్రలు పోషించా. 6వ తరగతి చదువుకుని నిమ్మకాయలు అమ్ముకుంటూ జీవిస్తాను. నటనపై ఆసక్తితోనే షార్ట్ ఫిలింలో నటిస్తున్నా.

-ఎన్.రాజశేఖర్, అత్తిలి

ఎడిటింగ్‌పై మక్కువ



బీటెక్ చదివి సినిమా ఎడిటింగ్‌పై మక్కువతో షార్ట్ ఫిలిం తీస్తున్నాను. ఇప్పటి వరకు 6 షార్ట్ ఫిల్మ్‌లు తీశాను. వాటిని యూట్యూబ్‌లో 5, 7 వేల మంది చూశారు. మంచి కథ, కథనంతో తీసే ఏ సినిమా, షార్ట్ ఫిలిం అయినా గుర్తింపు తెస్తుంది. సినిమాలో అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను.

- బండి సురేష్, షార్ట్ ఫిలిం దర్శకుడు

నటనపై ఆసక్తి



హోటల్ నిర్వహిస్తూ జీవించే నాకు చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తి. సినిమాలలో అవకాశం లేదు. షార్ట్ ఫిలింలో అవకాశం రావడంతో పలు పాత్రలలో నటించా. ఒకవైపు జీవనోపాధి కోసం హోటల్‌ను నిర్వహిస్తూనే షార్ట్ ఫిలింలో నటిస్తున్నా ఇప్పటి వరకూ 13 షార్ట్ ఫిలింలలో నటించా.

- కె.కాంతారావు, అత్తిలి

తాతయ్య స్ఫూర్తితో కామెడీ



సినిమాలో కామెడీ పాత్రలతో ప్రేక్షకులను నవ్వించే తాతయ్య నామాల మూర్తి స్ఫూర్తితో నటిస్తున్నా. బీటెక్ చదువుతున్నా. అమ్మాయి మదిలో షార్ట్ ఫిలింలో హీరోయిన్ పాత్రలో నటించాను. ప్రేమాయణం, కేరాఫ్ ధర్మవరం సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది.

- వై.మహతి, మండపాక, తణుకు మండలం

30 షార్ట్ ఫిల్మ్‌లలో నటించా



30 షార్ట్ ఫిల్మ్‌లు, 4 సినిమాల్లో నటించాను. హీరోయిన్ తండ్రి పాత్రలలో నటించాను. 2020 లాక్ డౌన్ నుంచి షార్ట్ ఫిల్మ్‌లో చేస్తున్నా. అమ్మో ఒకటో తారీకు సినిమాలో చేసిన నాకు దువ్వండి పాత్రలో నటన నాకు గుర్తింపు ఇచ్చింది. టిక్‌టాక్ స్టార్‌గా గుర్తింపు వచ్చింది.

- వై.టీ.మూర్తి, మండపాక

పట్టిసం ఉత్సవాలకు ఏర్పాట్లు : ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

ఏలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ రమణ అధికారులకు సూచించారు. పట్టిసీమలో బుధవారం జరిగిన మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించి రెండో ఉత్సవ సమావేశంలో తెలియజేయాలన్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుంచి 27 వరకూ జరిగే ఉత్సవాలలో ఆలయ ప్రాంగణం నుంచి ఇసుక తిన్నెలలోకి 100 మీటర్ల మేర చలువ పందిర్లు, షామియానా, బారికేడ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత ప్రసాదం, ఉచిత దర్శనం, జాగరణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, వైద్య, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జంగారెడ్డిగూడెం నుంచి 35 బస్సులు 120 ట్రిప్పులు రాకపోకలు సాగిస్తాయని ఆర్టీసీ డీఎం గంగాధరరావు తెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండి అదానీ, ఎస్ఐ పవన్ కుమార్, వింజరం వైద్యాధికారి మురళీధర్, విపత్తులశాఖ అధికారి అబ్రహం, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ మంగారావు, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దారు సాయి రాజు, ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లు వివరించారు.


ఖాళీగా శ్రీవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లు

శ్రీవారి ఆలయంలో తగ్గిన రద్దీ

ద్వారకాతిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ తగ్గింది. ఆలయానికి ప్రతీరోజు వందలు, వేలాదిగా తరలి వచ్చే భక్తులు అమావాస్య కారణంగా తక్కువ సంఖ్యలో వచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు సాధారణ భక్తుల రద్దీతో కనిపించాయి. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.



గాంధేయం..

మా పథం గాంధేయం
మా మార్గం గాంధీ మార్గం
మేం అనుసరిస్తుంటాం
చరిస్తుంటాం గాంధీ విధం
ఓ బాపూ! యుగయుగాలుగా
నీవే ఈ జగానికి బలం బలగం
ఓ జాతిపితా! అనునిత్యం
నీ నామస్మరణం విడువం విడువం
ఓ మహాత్మా!కాలాలు మారినా
తరాలు మారినా నిన్ను మరువం
దేశీయ వేష ధారణకు
అసలు సిసలైన చిరునామా నీ ఆహార్యం
చేతికర్రతో నడయాడే నీ బక్కపల్చని
నీ స్ఫుర్ద్రూపం మరువబోం
గోచీ బిగియించిన ముతక ఖద్దరు పంచె
అంగోస్త్రమే నీ వస్త్రాలంకరణం
సమయపాలనకు క్రమశిక్షణకు
మారు రూపైన నీ చరితం అద్వితీయం
జాతి స్వేచ్ఛకై నీవు ప్రదర్శించిన తెగువ,
సాహసం అనన్య సామాన్యం
స్వాతంత్ర్యానికి ఊపిరులూదిన
నీ ఉద్యమ స్ఫూర్తి అమోఘం అజేయం
సత్యం అహింసలే ఆయుధంగా నీవు
సాగించిన సమరం అనితర సాధ్యం
తరతరాలుగా భారతీయుల గుండెల్లో
కొలువైన నీ రూపం నిత్యనూతనం
అంటరానితన నిర్మూలనకై నీవొనర్చిన
సామాజిక చైతన్యం అనితర సాధ్యం
కులమత ప్రాంతాలకతీతంగా జాతిని
సమైక్యపరచిన సిద్ధాంతం అమేయం
దేశమాత బానిసత్వ విముక్తికై నీవు
అనుసరించిన విధానం స్ఫూర్తిదాయకం
నాయకులెందరినో సంఘటితపరిచిన
నీ సంభాషణాశక్తి సమ్మోహనం
దేశ జనుల గుండెల్లో గూడుకట్టుకొన్న
ఓ మహాత్మా అందుకో వందనం
ఓ భారత జాతి విముక్తి ప్రదాతా!
ఓ స్వేచ్ఛాయుత కారుణ్యమూర్తీ!
సత్యాహింసల బోధనలు చేసిన
ఓ గీతాచార్యా!
యావద్భారతం తరపున
అక్షరాభివందనం.

(గాంధీ వర్ధంతి సందర్భంగా)



అక్షర కిరీటి
తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
చరవాణి
82474 33432

పెళ్లికి వేళాయె..



మాఘమాసం.. బలమైన ముహూర్తాలు



మాఘమాసం ఎప్పుడొస్తుందో.. ఎదురు చూపులు ఫలించేలా మంచి ముహూర్తాలతో నేటి నుంచి ఈ మాసం ఆరంభం కానుంది. వస్తూనే మంచి ముహూర్తాలు కూడా తెచ్చింది. ఈ నెల 31న మంచి ముహూర్తమని పండితులు చెబుతున్నారు. ఈ నెలలో మొత్తం 11 ముహూర్తాలున్నాయి.

ద్వారకాతిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో ముఖ్య ఘట్టం పెళ్లి. అటువంటి పెళ్లి ఎప్పుడు చేసుకోవాలంటే ఎవరైనా ఠక్కున చెప్పేది మాఘమాసం పెళ్లిళ్లకు మాఘమాసం ప్రత్యేకం. ఈమాసంలో ఉన్న బలమైన ముహూర్తాలు మరే మాసంలో ఉండవని పండితులు, పురోహితులు చెబుతున్నారు. అందుకే మాఘమాసానికి అందరూ అంతటి ప్రాధాన్యం ఇస్తారు. ఈ మాసంలో బలమైన ముహూర్తాలలో పెళ్లిళ్ల చేసుకుంటే దాంపత్య జీవితం నిండు నూరేళ్ల పాటు సుఖ, సంతోషాలతో ఉంటుందని పురోహితులు చెబుతున్నారు. బలమైన ముహూర్తాలు ఈ మాసం ప్రారంభం నుంచి ఉన్నాయి.

ఈ నెల 30 నుంచి మాఘమాసం ప్రారంభమై వచ్చే నెల 28తో ముగియనుంది.. రాష్ట్రవ్యాప్తంగా పెళ్లి సందడి సంతరించుకుంది.. ఈ మాఘమాసంలో ఏకంగా 11 మంచి ముహూర్తాలు ఉండడంతో వేలాది జంటలు మాంగల్య బంధంతో ఒక్కటి కానున్నారు. జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రమైన చినవెంకన్న ఆలయం ఇందుకు ముస్తాబవుతోంది. పెళ్లివారు వివాహ వేడుకలకు సిద్ధమౌతుండగా.. కల్యాణమండప యజమానులు, పురోహితులు, కేటరింగ్, పూల మండపాలు.. ప్రతీ వారూ ఎవరి పనిలో వారు బిజీగా అయ్యారు. ఇప్పటికే దేవస్థానం, ప్రైవేటు కల్యాణమండపాలు, గదులు దాదాపు బుక్ అయ్యాయి. కల్యాణ మండపాలను అలంకరించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. పూల మండపాల అలంకరణ లక్షల్లో పలుకుతున్నాయి. కాటరింగ్, పురోహితులు, షామియానా, కార్ ట్రావెల్స్ వంటి వాటి ధరలకు రెక్కలొచ్చాయి.

ముహూర్తాలివీ..

వివాహాలకు అత్యంత బలమైన ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెల 31, ఫిబ్రవరి 2, 7, 8, 14, 15, 18, 20, 21, 22, 23 వరకూ మంచి ముహూర్తాలున్నాయిని పురోహితులు చెబుతున్నారు. క్షేత్రంలో జరిగే పెళ్లిళ్లకు దాదాపు అన్ని సత్రాలు, కాటేజీలు, రూములు ఎప్పుడో బుక్ అయ్యాయని, ముందు జాగ్రత్తలు లేనివారికి ఈ మాసంలో ఆయా రోజుల్లో పెళ్లిళ్ల చేయడం కష్టమవుతుందని చెబుతున్నారు.

మాఘమాస విశిష్టత

ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే అత్యంత పవిత్రమైన మాసం. పౌర్ణమి నాడు చంద్రుడు మఖ నక్షత్రంలో సంచరించడం వల్ల దీనిని మాఘమాసం అంటారు. మాఘం అంటే పాపాలను పోగొట్టేది అని అర్థం. కార్తీక స్నానానికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మాఘ స్నానానికి అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ఎన్నో శుభకార్యాలకు అనువైనది. సూర్యారాధన ఎంతో ముఖ్యమైనదిగా చెబుతారు.

మంచి ముహూర్తాలు



ఈ మాఘంలో వివాహాలకు 11 మంచి ముహూర్తాలు ఉన్నాయి. అన్ని నక్షత్రాల వారికి తగిన బలమైన ముహూర్తాలు వచ్చాయి. ఆ తరువాత వచ్చే ఫాల్గుణమాసం శూన్య మాసం. వివాహాలు అంతంతమాత్రంగా జరుగుతాయి. ఆ తర్వాత మార్చి 18 నుంచి 28 వరకూ గురు మౌఢ్యమి కారణంగా పెళ్లిళ్ల జరుగవు. ఏప్రిల్ 2 నుంచి చైత్రమాసంలో మరల పెళ్లిళ్ల ప్రారంభమవుతాయి.

గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, పురోహితుడు, ద్వారకాతిరుమల

జేఎన్వీలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి 8న పరీక్ష

పెదవేగి, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9, 11 తరగతుల ప్రవేశానికి ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు 9వ తరగతికి 1,007మంది, 11వ తరగతికి 653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఏలూరులో 5, జేఎన్వీలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. 8వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష ప్రారంభ సమయానికి గంట ముందే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్లను వెబ్ సెట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. 9వ తరగతికి సంబంధించి హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీఎంఎస్.ఎన్ఐసీ.ఇన్/2024/ఎన్వీఎస్ఐఎక్స్, 11వ తరగతి అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీఎంఎస్.ఎన్ఐసీ.ఇన్/2024/ఎన్వీఎస్ఎక్స్ఐ వెబ్ సైట్ల నుంచి హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. మరిన్ని వివరాలకు 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 80748 33690, 94917 31486 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

జేఈఈ మెయిన్‌కు 22 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ పరీక్షల్లో భాగంగా బుధవారం స్థానిక సిద్దార్థ క్వెస్ట్ స్కూలు పరీక్ష కేంద్రానికి 22 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు కేటాయించిన 180 మంది విద్యార్థులకు 171 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 149 మందికి గానూ 146 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం 76మందికి 75, మధ్యాహ్నం 37మందికి 35, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం సెషన్ పరీక్షకు 99మందికి 95, మధ్యాహ్నం సెషన్‌కు 107మందికి 104మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 22 మంది గైర్హాజరయ్యారు. కాగా తొలివిడత జేఈఈ మెయిన్ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. మలివిడత పరీక్షలు ఏప్రిల్‌లో జరగనున్నాయి.

శతాధిక వృద్ధురాలు జల్లేపల్లి అచ్చాయమ్మ ఇకలేరు..


అచ్చాయమ్మ(ఫైల్)

పోలవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం నూతనగూడెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు జల్లేపల్లి అచ్చాయమ్మ(109) బుధవారం ఆమె నివాసం వద్ద మృతి చెందారు. మూడు తరాలకు పైగా తన కుటుంబ సభ్యులను ఆమె తన కళ్లారా చూసుకున్నారు. ఆమెకు ఐదుగురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు ఉన్నారు. ఇప్పుడు వాళ్లు కూడా వృద్ధాప్య దశలో ఉన్నారు. కోడళ్లు, అల్లుళ్లు, మనవళ్లు, మునిమనవళ్లు కలిపి మొత్తం ఆమె కుటుంబ సభ్యులు 150 మందికి పైగా ఉన్నారు. వందేళ్లకు పైబడి జీవించిన ఆమె ఇక లేరని తెలియడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులంతా చివరి సారి కన్నీటి వీడ్కోలు పలికారు.

ఎలక్ట్రికల్ దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు


తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

ఏలూరు క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరామ్‌బాబుకు అందిన సమాచారం మేరకు ఏలూరులోని ఎలక్ట్రికల్ షాపుల్లో విజిలెన్స్, తూనికలు, కొలతల అధికారులు దాడులు నిర్వహించారు. ఎలక్ట్రికల్ దుకాణాల్లో ఉన్న పలు ఉపకరణాలను పరిశీలించారు.తయారు దారుని చిరునామా, ధర, ఫోన్ నెంబర్ లేని ఎలక్ట్రికల్ ఉపకరణాలను గుర్తించి ఆరా తీశారు. నగరంలోని దుకాణాల్లో తనిఖీలు చేసి 14 కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్లు పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్ కుమార్, విజిలెన్సు ఏవో జి.మీరయ్య, ఎస్ఐ కె.సీతారామ్, తూనికలు కొలతల అధికారి వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుల జబ్‌మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దివ్యాంగుల జాబ్‌మేళాకు విశేష స్పందన

ఏలూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. వివిధ ప్రైవేట్ కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలకు సంబంధించి బుధవారం స్థానిక ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొని ప్రతినిధులతో మాట్లాడారు. ఆయా కంపెనీలకు చెందిన ప్రతి నిధులు ఈ మేళాలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించగా కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 142 మంది దివ్యాంగులు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 67మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి కలెక్టర్ అర్హత పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటాపద్మశ్రీ, ఆర్డీవో అచ్యుత్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, సెట్వెల్ సియిఓ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో రూ.కోట్లలో టోకరా..

పెదపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఎటువంటి అనుమతులూ లేని ప్రైవేటుగా చిట్టీలను నడిపి గ్రామస్థులను మోసం చేసిన ఒకే కుటుంబంలోని ముగ్గురిపై పెదపాడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జవ్వాది శ్రీనివాస రావు స్థానికంగా పచారీ కొట్టు, క్యాటరింగ్‌తో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా చిట్టీలను నడుపుతున్నాడు. గ్రామంలో అందరి వద్ద నమ్మకస్తుడిగా ఉండటంతో సుమారు 150 మంది వరకు ఇతని వద్ద చిట్టీలు వేయడంతో పాటుగా పలువురు అప్పులిచ్చారు. ఈ మొత్తం రూ.కోట్లలోనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కొంత కాలంగా అందరికీ చిట్టీల నగదు సక్రమంగా చెల్లించిన శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులు డిసెంబరు 23వ తేదీ నుంచి కనిపించలేదు. దీంతో చీటీల పేరుతో జవ్వాది శ్రీనివాస రావు, భార్య రత్నమణి, కుమారుడు సంజయ్‌లు మోసం చేసినట్టు పిల్లగొళ్ళ వీరాస్వామి పెదపాడు పోలీసులకు ఈ నెల 28న ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుటుంబం అదృశ్యంపై కేసు నమోదు


అదృశ్యమైన కుటుంబం (ఫైల్)

ఏలూరు క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె, అల్లుడు, మనుమడు అదృశ్యం అయ్యారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పరిధిలో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఏలూరు మండలం తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన పుట్టి వీర వెంకట సత్యవర ప్రసాద్(45) మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య పుట్టి వెంకట పార్వతి (41), కుమారుడు పుట్టి గగన్ అద్యుత్ (2) లు ఉన్నారు. గత కొంత కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అనేక అప్పులు కూడా చేశాడు. ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆ ముగ్గురు కనిపించకపోవడంతో పార్వతి తండ్రి అయిన ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం రాణీనగర్ రామాలయం ప్రాంతానికి చెందిన తమ్మిరెడ్డి రంగారావు ఈ నెల 25వ తేదీన తన కుమార్తెకు ఫోన్ చేశాడు. తామంతా ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నామనిచెప్పారు. షాపు తీయకపోవడంతో ఆయన అల్లుడు ప్రసాద్‌కు, కుమార్తెకు ఫోన్ చేయడంతో రెండు ఫోన్లూ స్విచ్‌ఆఫ్ వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ్మిరెడ్డి రంగారావు ఏలూరు టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.


మేదినరావుపాలెంలో మొక్కజొన్న సాగు చేస్తున్న భూమి


గట్టుపై వేసిన పాక


పత్తి పంట వేసిన ఆక్రమిత భూమి

గుట్టుగా గట్టు స్వాహా...

- పోలవరం కుడి కాల్వ గట్టుపై ఇష్టారాజ్యంగా ఆక్రమణలు
- గట్టు తొలగింపుతో ముంపు సమస్యపై ఆందోళన
- రాత్రిళ్లు గుట్టుగా మట్టి తరలింపు - అనంతరం భూమిలో పంటల సాగు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- గత వైసీపీ హయాంలో మొదలైన తంతు

మందూరు వద్ద గట్టు పరిస్థితి



దెందులూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పోలవరం కుడికాల్వ గట్టు ఆక్రమణల చెరలో చిక్కుకుంది. రాత్రివేళల్లో తొలుత గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. ఆ తర్వాత ఆ భూమిని దర్జాగా ఆక్రమించి పశువుల పాకలు, షెడ్లు, గడ్డివాములు, మొక్కజొన్న, అరటి, పత్తి, పామాయిల్, కొబ్బరి వంటి పంటల సాగు చేపడుతున్నారు. సొంత భూముల మాదిరిగా దర్జాగా సాగునీటి బోర్లు వేసి డ్రిప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమందికి విద్యుత్ మీటర్లు సైతం రావడం గమనార్హం. పోలవరం కుడి కాల్వ గట్టు 60 శాతం వరకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే మాయమైంది. కొంత మంది అనుమతులు లేకుండా వైసీపీ నాయకుల అండదండలతో అప్పట్లో గట్టును తవ్వేసి మట్టిని పెద్ద ఎత్తున తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇరిగేషన్, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో గత ఐదేళ్లలో నియోజకవర్గంలో సుమారు రూ.50 కోట్ల విలువైన మట్టిని అక్రమంగా తరలించారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా టీడీపీ కూటమి ప్రభుత్వంలోను అధికారులు, పోలవరం కాల్వ గట్టును పరిరక్షించే క్షేత్రస్థాయి లస్కర్లు ఉన్నప్పటికీ రాత్రిళ్లు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దెందులూరు నియోజకవర్గ బోర్డర్ పంగిడిగూడెం, మెట్టపంగిడి గూడెం, మేదినరావు పాలెం, మందూరు, గంగన్నగూడెం, లక్ష్మీపురం,కొత్తపల్లి, వంగూరు, అంకన్నగూడెం, మడిచర్ల ప్రాంతాల నుంచి రాత్రిళ్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఉన్న గట్టును తవ్వడంతో పాటు పోలవరం కాల్వకు సమంతరంగా మట్టిని చదును చేసి తరలించడం వల్ల భవిష్యత్తులో ముంపు సమస్య తలెత్తే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ నేతలు టీడీపీ గూటికి చేరారు. దీంతో తమకు ఎలాంటి ఢోకా లేదని టీడీపీ నాయకుల అండదండలు ఉన్నాయనే దీమాతో ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పోలవరం కాల్వ గట్టును అక్రమించి నిర్మాణాలు చేసిన వారిపైన, మట్టి మాఫియాపైన కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



ఇసుకాసురులు...

- ర్యాంపుల్లో లారీల నుంచి అదనపు వసూళ్లు
- చర్యలు శూన్యం
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో దోపిడీ రోజుకి 50 లక్షల పైమాటే
- నిర్ణీత ధరకు ఇస్తే ఐదు యూనిట్లు 7 వేల రూపాయలే..

పాలకొల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : జగన్ మార్కు పాలన ధరలతో పోలిస్తే ఇసుక ధర ఇప్పుడు కొంత మేరకు తగ్గినప్పటికీ ఇంకా తగ్గాల్సి ఉంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ర్యాంపుల్లో నిర్ణీత ధర కంటే అధికంగా దోచేస్తున్నారు. వాస్తవంగా 5 యూనిట్లు లారీ ఎగుమతికి కనిష్టంగా రూ.1380, గరిష్ఠం రూ.2020 ఉండగా రూ.5వేలు నుంచి 7వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో అయితే సిండికేట్‌గా ఏర్పడి ఊబలంక, మల్లేశ్వరం ఇంకా పలు ర్యాంపుల్లో 5 యూనిట్ల లారీ ఎగుమతికి రూ.7వేలు వసూలు చేస్తున్నారు. పాత పశ్చిమ గోదావరి జిల్లాలో కనీసం బిల్లులు లేకుండానే ఇసుకను తరలిస్తున్నారు. పెండ్యాల, తీపర్రు, పందలపర్రు తదితర ర్యాంపుల్లో లోకల్ లారీలకైతే రూ.5 వేలు ఇతర ప్రాంతాల లారీలకైతే రూ.6వేలు వసూలు చేస్తున్నారు.వీటికి ఏవిధమైన బిల్లులు ఇవ్వడం లేదని లారీ యజమానులే చెబుతున్నారు. ఇటీవల రెండు జిల్లాల్లోని అధికారుల దృష్టికి అక్రమ వసూళ్లను తీసుకొచ్చినా చర్యలేమీ లేవంటూ లారీ యూనియన్ నాయకులు వాపోతున్నారు.

ప్రజా ప్రతినిధులకు వాటాలు...

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రోజుకీ సుమారు వెయ్యి లారీల ఇసుక ఎగుమతి చేస్తున్నారు. లారీకి రూ.5 వేల చొప్పున లెక్కిస్తే రోజుకి రూ.50 లక్షలు పైమాటే.. ఆయా ర్యాంపుల పరిధిలో నియోజకవర్గాల వారీగా కొందరు ప్రజాప్రతినిధులు అక్రమ వసూళ్లను ప్రోత్సహిస్తూ వాటాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ర్యాంపుల్లో నిర్ణీత ధరకు ఇసుక ఎగుమతి చేస్తే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆయా ప్రాంతాలను బట్టి 5 యూనిట్ల ఇసుక రూ.5వేల నుంచి 7వేల మధ్యలోనే అందించవచ్చని లారీ యజమానులు చెబుతున్నారు. ర్యాంపుల్లో అక్రమ వసూళ్లపై ప్రశ్నిస్తే ఇసుక ఎగుమతి చేయడం లేదని రోజులు తరబడి ర్యాంపుల వద్ద నిరీక్షించాల్సి వస్తోందని పలువురు లారీ డ్రైవర్లు వాపోతున్నారు.మొత్తంగా ప్రభుత్వ ప్రతిష్ఠతకు గత ఎనిమిది నెలలు నుంచీ ఇసుకాసురులు భంగం కల్గిస్తూనే ఉన్నారు. ర్యాంపుల్లో అక్రమ వసూళ్ల అరికట్టాలని ఇసుక వినియోగదారులు కోరుతున్నారు.

డీఎల్ఎడ్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

ఏలూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) 3వ సెమిస్టర్ పరీక్షలకు ఫీజు చెల్లించే గడువును పొడిగించినట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 31 పెనాల్టీ లేకుండా ఫీజు చెల్లించవచ్చని, ఫిబ్రవరి 4వ తేదీ లోపు 50 రూపాయల పెనాల్టీతో ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నేటి సాయంత్రం వరకు 'టిస్' ఎడిట్ ఆప్షన్

ఏలూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా 'టిస్' (టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో వ్యక్తిగత లాగిన్ ద్వారా ఎడిట్ ఆప్షన్ ఇచ్చినట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఇప్పటికే నమోదు చేసిన వివరాల్లో ఏవైనా తప్పులుంటే వాటిని మార్పులు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్టు తెలిపారు. ఈ వెసులు బాటు గురువారం సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటుందని, నిర్ణీత గడువులోగా మార్పులు చేసుకోవాలని సూచించారు.

న్యాయమూర్తుల బదిలీ

ఏలూరు క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయమూర్తులను వివిధ కోర్టులకు బదిలీ చేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిలుగా పని చేస్తున్న ముగ్గురికి అదనపు జిల్లా జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏలూరులోని పనిచేస్తున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) ఐ శ్రీనివాస మూర్తిని ఏలూరులోని ఎస్సీఎస్టీ కోర్టుకు 8వ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. ఏలూరులోని ఎస్సీఎస్టీ కోర్టు కమ్ 8వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఎం.సునీల్ కుమార్‌ను మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా నియమించారు.

పోలవరం ప్రాజెక్టు స్పిల్ ఛానల్‌లో పడి కార్మికుడి మృతి

పోలవరం జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు స్పిల్ ఛానల్‌లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందాడు. బుధవారం ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని కుంతీనగర్ గ్రామానికి చెందిన ధనిబంజన్వా నాగేంద్ర(33)అనే ప్రాజెక్టు స్పిల్ ఛానల్‌లో స్నానానికి దిగి చనిపోయాడని తెలిపారు.

బీసీల యాక్షన్ ప్లాన్ అమలుపై జడ్పీ చైర్మన్ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న పద్మశ్రీ

ఏలూరు సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బీసీ యాక్షన్‌ప్లాన్‌ను నిర్దేశించిన లక్ష్యాలను సమయంలోగా పూర్తి చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఏలూరు జడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో బీసీ యాక్షన్ ప్లాన్ అమలుపై అధికారులతో ఆమె సమీక్షించారు. అనంతరం ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను అర్హులకు మార్చి లోగా అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారించుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక శిక్షణతో పాటు సాంకేతిక మద్దతు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల ఆర్థిక ప్రగతికి ఈ ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందని, అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ ఈడి ఎన్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

కుక్కునూరులో వ్యక్తి ఆత్మహత్య నెలరోజుల తరువాత బయట పడిన వైనం

కుక్కునూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యాన్ని తాళలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఐతా రమేష్(32)అనే వ్యక్తి గత కొన్నేళ్ళుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నాడని తెలిపారు. ఈ క్రమంలో కుక్కునూరులో అతని బంధువులు ఉండటంతో గత నెల డిసెంబర్ 30న కుక్కునూరు వచ్చి బంధువులందర్ని పలకరించి వెళ్ళాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభించలేదు. అయితే బుధవారం కుక్కునూరు గ్రామ శివారులోని ఓ జామాయిల్ తోటలో కొందరూ కూలీలు పని చేస్తున్న క్రమంలో గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందడంతో విచారణ జరిపి ఐతా రమేష్ మృత దేహంగా గుర్తించినట్టు ఎస్సై తెలిపారు.

హుండీ చోరీ కేసులో ఒకరి అరెస్టు

అత్తిలి, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : అమ్మవారి ఆలయంలో హుండీ ధ్వంసం చేసి నగదు దోచుకెళ్లిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.ప్రేమరాజు బుధవారం తెలిపారు. ఈ నెల 14న అత్తిలి శ్రీవిజయ చాముండేశ్వరి అమ్మవారి ఆలయం తలుపులు బద్దలుకొట్టి హుండీలో ఉన్న సుమారు 20 వేల రూపాయల నగదును దోచుకెళ్ళిన సంఘటనపై ఆలయ ధర్మకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో నిందితుడిగా గుర్తించిన అత్తిలి మండలం పాలూరు గ్రామానికి చెందిన బండి శ్యాంబాబును బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ ప్రేమరాజు చెప్పారు.

తాడేపల్లిగూడెంలో వివాహిత ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న కలగాని స్వాతి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పోలీసులు తనను వేధిస్తున్నారంటూ తాడేపల్లిగూడేనికి చెందిన కలగాని స్వాతి బుధవారం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బావ కలగాని నాగశ్రీనివాసరావు లైంగికంగా వేధిస్తున్నాడని గతంలో కేసు పెట్టినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా తననే తిరిగి వేధింపులకు గురిచేస్తున్నారని స్వాతి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. విషంతాగిన స్వాతిని స్థానికులు గుర్తించి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పట్టణ సీఐ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా గతంలో స్వాతిపై గతంలో అత్త కేసు పెట్టిందని, ఆ నోటీసులివ్వడానికి వెళ్లిన కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించినట్టు తెలిపారు. ఇప్పుడు ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆస్పత్రిలో చికిత్స పొదుతోందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్పష్టం చేశారు.

నయా జాబితా...

- పోలవరం పునరావాసంలో మరో 13 వేలేరుపాడు గ్రామాలు
- జాబితాలో చేర్చిన అధికారులు
- ముంపు గ్రామాలు ఇంకా ఉన్నాయంటూ విమర్శలు...
- జలవనరుల శాఖ అధికారుల తీరుపై నిర్వాసితుల్లో అసహనం

వేలేరుపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పునరావాస పునరావాస ప్రక్రియలో వేలేరుపాడు మండలంలో మరో 13 గ్రామాలు చేర్చారు. ఇప్పటి వరకు ఈ గ్రామాలు 45.72 కాంటూరులో ఉన్నట్లుగా అధికారులు చూపిస్తూ వచ్చారు. వాస్తవానికి ఈ గ్రామాలు 41.15 కాంటూరులోని గ్రామాలతో పాటు ఇప్పుడు పునరావాసంలో చేర్చిన 13 గ్రామాలైన బోళ్ళపల్లి, ఎడవల్లి, ఎర్రమెట్ట, సిద్ధారం, చిట్టంరెడ్డిపాలెం, చింతలపాడు, కాచారం, కాకీసనూరు, కొత్తూరు, పేరంటాళ్ళపల్లి, టేకుపల్లి, టేకూరు, తూర్పుమెట్ట, పడమరమెట్ట, గ్రామాలను కొత్తగా ముంపు జాబితాలో చేర్చగా ఈ గ్రామాల్లో 1,351 కుటుంబాలు నిర్వాసితులు కానున్నారు. వీరందరికి పునరావాసం కల్పించేందుకు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తించేలా అధికారులు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇదిలా ఉంటే జలవనరులశాఖ గతంలో ఈ మండలంలో ముంపు ప్రాంతాలను సర్వే చేసినప్పుడు వారు చేసిన పొరపాటు కారణంగా మారికొన్ని గ్రామాలు ముంపులో లేకుండా పోయాయి. వాస్తవానికి నడిమిగొమ్ముకాలనీలోని సగభాగం తాటుకూరు గొమ్ము కాలనీ, సుద్దగుంపు, యర్రబోరు, శివకాశీపురం గ్రామాలు కూడా ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొనున్నాయి. గోదావరి నదికి సాధారణంగా వచ్చే వరదల కారణంగానే ఈ గ్రామాల చుట్టూ వరద వచ్చి చేరుతుంది. 2022 జూలైలో గోదావరికి సంభవించిన వరదల కారణంగా ఈ గ్రామాలన్నీ పూర్తిగా మునిగిపోయాయి. కానీ ఈ గ్రామాలు 45.72 కాంటూరులో ఉన్నాయని చెబుతున్న అధికారులు ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో ఈ గ్రామాలను చేర్చకపోవడంపై విమర్శలు చెలరేగుతున్నాయి. పోలవరం పూర్తయితే మండలంలోని 7 గ్రామ పంచాయతీల్లోని 17 రెవెన్యూ గ్రామాలు పూర్తిగా నీట మునిగిపోతాయి. గత వరదలను ప్రత్యక్షంగా చూసిన అధికారులు ఈ గ్రామాలపై దృష్టి పెట్టకపోవడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాలను ముంపు జాబితాలో చేర్చాలని నిర్వాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.


జాబితాలో లేని తాటుకూరు గొమ్ముకాలనీ

ఆకట్టుకున్న బుర్రకథా గానం

భీమవరంటౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కొటికలపూడి గోవిందరావు కళావేదికపై తాడేపల్లిగూడేనికి చెందిన కళాసమితి శ్రీదేవిచే బుర్రకథా గానం చేశారు. సాయంత్రం 3గంటలకు భీమవరానికి చెందిన కొల్లాటి మావుళ్లరాజు శిష్య బృందం వారిచే శాస్త్రీయ సంగీత కచేరీ, సాయంత్రం 4గంటలకు కైకలూరు శ్యామల నాట్య మండలి కూచిపూడి జనపద నృత్యప్రదర్శన నిర్వహించారు. రాత్రి 9 గంటలకు పంచరత్నాలు నాటకాలను ప్రదర్శించారు.


బుర్రకథా గానం చేస్తున్న కళాకారులు

బండి కాదిది... మొండి...

ద్వారకాతిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దర్జాగా బస్సులో కూర్చుని స్కూల్‌కు వెళ్లాల్సిన విద్యార్థులు మొండికేస్తున్న బండిని లాగాల్సి వస్తోంది. ద్వారకా తిరుమల సూపర్ బజార్ వద్ద సాంకేతిక లోపంతో ఆగిన బస్సును విద్యార్థులతోనే నెట్టించి ఇంజన్‌ను స్టార్ట్ చేసేందుకు ఓ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు డ్రైవర్ నానా తంటాలు పడ్డాడు.. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు మాత్రం కండీషన్ లేని బస్సులను ఎందుకు నడుపుతున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


బస్సును తోస్తున్న విద్యార్థులు

దివ్యాంగులకు ఫిజియోథెరఫీపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ఏలూరు/ఏలూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం నిధులతో ఏలూరు దొండపాడులో నిర్వహిస్తున్న ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ద్వారా అవసరమైన దివ్యాంగులకు ఉచితంగా ఫిజియోథెరపి, క్యాలిపర్స్ లబ్ధిపొందేందుకు జిల్లా అంతా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రం సమావేశం బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు తయారు చేయించుకుని లబ్ధి పొందేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివరాలకు 08812-249297, 73865 65469 నంబర్లను సంప్రదించాలన్నారు. వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ బి. రామ్‌కుమార్, డీపీవో కె.అనురాధ, ఐసీడీఎస్ పీడీ శారద, సొసైటీ ఇన్‌ప్లాం టింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పెద్దిరెడ్డి, సభ్యులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పాప దత్తత విషయంపై ఆరా

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహం అనుసంధానంగా ఉన్న బాల సదనంలో మహతిసౌమ్య అనే పన్నెండేళ్ల పాపను తమిళనాడు రాష్ట్రానికి చెందిన జనార్ధన్, కె.సీతామహాలక్ష్మి దంపతులకు నియమ నిబంధనల ప్రకారం కేరింగ్స్ పోర్టల్ ద్వారా గతనెల 5వ తేదీన ప్రీఅడాప్షన్ తీసుకున్నారు. పాపతో అనుబంధాన్ని పెంచుకున్న తరువాత పాప పట్ల అవలంబిస్తున్న పెంపక విధానాలు గమనించి తుది దత్తత ఉత్తర్వులను బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి అందించి పాప యోగక్షేమాలను ఆరా తీశారు. ఈవిధంగా పెద్ద పాపలను 5,6 ఏళ్ళ పైబడిన బాలలను దత్తత తీసుకోవడం శుభపరిణామం అని సంతృప్తి వ్యక్తం చేశారు.

రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వండి

- సీఎంను కోరిన టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర


సీఎంను కలిసిన దాసరి శ్యామ్‌చంద్ర శేషు

ఏలూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఎప్పటినుంచో నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న జంగారెడ్డిగూడెం- ములగలంపల్లి వయా శ్రీనివాసపురం, మైసన్నగూడెం రోడ్డు నిర్మాణానికి వెంటనే ఆదేశాలు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్ర శేషు కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ హయాంలో ఈ రోడ్డు కోసం పార్టీ నాయకులతో కలిసి అనేక పోరాటాలు చేసి రెండుసార్లు అరెస్టు కూడా అయ్యాయన్నారు. దీనిపై స్పందించిన సీఎం పరిశీలించి తగు చర్యలు చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారని శేషు చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఎస్సీసెల్ అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వరరావు, రొంపిలి శ్రీను ఉన్నారు.

బలివే భక్తుల కోసం ప్రత్యేక చర్యలు : చింతమనేని


బలివే వంతెన దగ్గర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : మహాశివ రాత్రికి బలివే రామలింగేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజయరాయి దగ్గర తమ్మిలేరులో ఏర్పాట్లపై బుధవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన వేలసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరించి, పితృదేవతలకు తర్పణాలు వదులుతారన్నారు. ఆ సమయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్నానాల ఘాట్లతో పాటు జల్లు స్నానాలకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పురోహితులకు ఒకపక్క ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉంటాయని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు పెదర్ల రాంబాబు, నానీ, దారిబోయిన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సూపర్ 6 పథకాలతో ప్రజలకు భరోసా : బడేటి చంటి


ఎమ్మెల్యే చంటితో ఎన్టీయే జిల్లా నాయకులు

ఏలూరుటూటౌన్/ఏలూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలతో ప్రజలకు భరోసా కల్పించిందని, వైసీపీ ప్రభుత్వం నవరత్నాలతో ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఏడు నెలల్లో వైసీపీ వదిలి వేసిన సమ స్యలన్నింటిని దాదాపుగా పరిష్కరించామన్నారు. చల్లా సత్య వరప్రసాద్, బెల్లంకొండ కిషోర్, పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకటరత్నం, ఆర్నేపల్లి తిరుపతి పాల్గొన్నారు.

రాజశేఖరానికే ఎన్టీయే మద్దతు

ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతునిస్తున్నట్టు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీయే) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. వెంకటరమణారావు, పి.మురళి ప్రకటించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటిని సంఘ నాయకులు కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖర్‌ను గెలిపించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. బి.రాము, లూర్ధుమాత, ఇంద్రాణి, విజయానంద్, వెంకటేశ్వరరావు, సాయిశ్రీనివాసరావు, ఎడ్వర్డ్, బాలాజీనాయక్ తదితరులున్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ఏలూరుటూటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ కో-ఆప్షన్‌సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు అన్నారు. దెందులూరు వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. స్టోరేజ్ ట్యాంకులో వాటర్‌ను పరిశీలించి మాట్లాడారు. ట్యాంకులో 40 రోజులకు సరిపడా తాగునీరు నిల్వ ఉందన్నారు. గోదావరి కాల్వనీరును పంపింగ్ చేయడానికి మోటార్లు సరిగా పని చేయకపోవడంతో వాటి స్థానంలో కొత్త మోటార్లను ఏర్పాటు చేశామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో జనవరిలో 16 మీటర్ల లోతు నీళ్లు ఉండేవని ఇప్పుడు 13 మీటర్ల లోతు ఉన్నాయన్నారు. ఎంఈ సురేంద్రబాబు, డీఈ రజాక్, ఏఈ సాంబశివరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

ఏలూరుటూటౌన్, జనవరి29(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం ఏలూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు ఏసురాజు తదితరులు సమావేశం అయ్యారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అందుబాటులో లేకపోవడంలో ఫోన్‌లో చర్చించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు ప్రజల సమస్యలు ఎంపీకి వివరించామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు వద్దకు తీసుకెళ్లి కొల్లేరు ప్రాంత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారని తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజ

నిడమర్రు, జనవరి 29 : సామాజిక విద్యా సేవా కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. బుధవారం భువ్వనపల్లిలో లయన్స్ క్లబ్ జోన్ సోషల్ సమావేశం జోన్ చైర్మన్ పోశింశెట్టి రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. లయన్స్ క్లబ్ గణపవరం అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్‌కు వెయ్యి డాలర్ల చెక్కును డిస్ట్రిక్ వైస్ గవర్నర్ ఎన్. పాపారావునాయుడు, ఆర్‌వీఎస్ రాజు, పుట్టా జయశ్రీలకు అందజేశారు. జల్లికొమ్మర ప్రాథమికోన్నత పాఠశాలకు డిజిటల్ ఎడ్యుకేషన్ కోసం స్మార్ట్ టీవీ కొనుగోలు నిమిత్తం రూ.30 వేల చెక్కును పాఠశాల హెచ్ఎం కె.సుందర్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం జోన్ చైర్మన్ పోశింశెట్టి రామ్మూర్తి, అధ్యక్షుడు పి.నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

» 1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాగిరెడ్డిగూడెం, పంతంగులగూడెం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. పాత నాటు సారా కేసులో ఇరువురిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు, ఏలూరు ఎక్సైజ్ ఎస్ఐ గౌరీశంకర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

భీమడోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పాతూరు గ్రామానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి మతి స్థిమితం లేనికారణంగా ఇంటి నుంచి తప్పిపోయి నట్టు బంధువుల ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 14న ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెంకన్న వెళ్ళిపోయాడని అప్పటి నుంచి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా ఇంటి నుంచి వెళ్ళిపోయిన వెంకన్న రెండు మూడు రోజులకు మళ్ళీ వచ్చేవాడని ప్రస్తుతం 15 రోజుల నుంచి ఇంటికి రాలేదని ఆచూకీ లభించకపోవడంతో భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు భీమడోలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నూతన రోడ్ల నిర్మాణం ఆక్రమణల తొలగింపు


ఏలూరులో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు

ఏలూరు నగరంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు నూతన రోడ్ల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం చేపట్టింది. నగరంలో ఇప్పటికే 860 గుంతల రోడ్లను గుర్తించి గత ఏడునెలల కాలంలో ఆ గుంతలను పూడ్చి వేశారు. ప్రస్తుతం నూతన రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. మరోవైపు తంగెళ్ళమూడి వంతెన వద్ద రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న నిర్మాణాలను నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. ఇటీవల నాలుగు రోడ్ల కూడలి ఇరుకుగా ఉందని స్థానికుల ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు.

- ఏలూరుటూటౌన్


తంగెళ్లమూడిలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

3న డిప్యూటీ మేయర్ల ప్రమాణ స్వీకారం

ఏలూరుటూటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పాలక మండలి డిప్యూటీ మేయర్ల ఎన్నిక ఫిబ్రవరి 3న నిర్వహిస్తామని మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఇప్పటి వరకు డిప్యూటీ మేయర్లుగా వైసీపీకి చెందిన కార్పొరేటర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపేమి సుధీర్‌బాబు ఉన్నారు. వారి స్థానంలో నూతన డిప్యూటీ మేయర్లుగా 47వ డివిజన్‌కు చెందిన వందనాల దుర్గాభవాని, 30వ డివిజన్‌కు చెందిన పప్పు ఉమామహేశ్వరరావు వీరి ఇరువురు కూటమి ప్రభుత్వానికి చెందిన కార్పొరేటర్లు. ఎమ్మెల్యే చంటి వీరి ఇరువుర్ని డిప్యూటీ మేయర్లు కూటమి తరఫున ప్రకటించటంతో దాదాపు వీరి ఎన్నిక లాంఛనమే అవుతుంది. అదేరోజున ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈకి అభినందనలు

ఏలూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రిపబ్లిక్‌డే సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన శకటాల్లో ఏలూరు విద్యుత్‌శాఖ రూపొందించిన శకటానికి ద్వితీయస్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా అమరావతి నుంచి ప్రశంసలు అందుకుంది. ఎనర్జీ విభాగం, రాష్ట్రప్రభుత్వం నుంచి ఏలూరు విద్యుత్‌శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజుకు ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ఆ శాఖ అధికారులు ఎస్ఈ పి.సాల్మన్‌రాజును, కె.ఎమ్ అంబేద్కర్‌ను పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఏలూరు ఈఈ టెక్నికల్ పి.రాధాకృష్ణ, డిఈఈలు బీవీ కృష్ణరాజా, టి.రాజ్‌కుమార్, ఎ.రమాదేవి, నాయకులు తురగా రామకృష్ణ, బూక్యా నాగేశ్వరరావు, తదితరులు అభినందించారు.

18 ఏళ్లు నిండిన వారికి పరిహారం అందించాలి

బుట్టాయగూడెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గిరిజనులైన 18 ఏళ్లు నిండిన వారందరికి ఆర్అండ్ ఆర్‌లో పరిహారం అందించాలని గిరిజనులు కోరారు. బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో నిర్వాసిత గిరిజనులు ఐటీడీఏ పీవో, ఆర్అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రత్యేకమైన తేదీతో సంబంధం లేకుండా 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ మండల కన్వీనర్ చోడెం దుర్గ ఆధ్వర్యంలో రామన్నగూడెంలోని భూసమస్యను పరిష్కరించాలని గిరిజనులు పీవోకు వినతి పత్రం అందజేశారు. గిరిజనులు, నిర్వాసితులు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యత ప్రకారం పరిష్కారిస్తానని పీవో హామీ ఇచ్చారు.

సేవాలాల్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ఏలూరు అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న పురస్కరించుకుని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.కృష్ణనాయక్, డి.రాజబాబు నాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జయంతి వేడుకలను అన్ని జిల్లాల్లో, తండాల్లో ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. లంబాడీ తండాల్లో సమస్యలపై చర్చించి, తీర్మానాలను ప్రభుత్వానికి పంపేందుకు ఈనెల 31న సాయంత్రం నాలుగు గంటలకు సంఘ జిల్లా కార్యవర్గసమావేశాన్ని చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

పిల్లలకు పోషక ఆహారాన్ని అందించాలి

కొయ్యలగూడెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషకాహారాన్ని అందించాలని కొయ్యలగూడెం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి సూచించారు. బుధవారం చొప్పరామన్నగూడెం గ్రామంలో సెక్టార్‌లో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే త్వరగా పూర్తిచేయాలి

లింగపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సమగ్రంగా, త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. లింగపాలెం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన లక్ష్మీ గణపనేనివారిగూడెంలో జరుగుతున్న రీసర్వే పనులను బుధవారం పరిశీలించారు. రీసర్వే విషయమై డీటీ నాగబాబు, మండల, గ్రామ సర్వేయర్లతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలన్నారు. వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


బ్యాంకు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న రీజనల్ మేనేజరు శ్రీదేవి

ఏలూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఏలూరు రీజనల్ మేనేజరు యు.శ్రీదేవి అన్నారు. స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక నరసింహారావుపేటలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఏలూరుశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రాంగణంలోనూ, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి నీరుపోశారు. ఎన్ఆర్‌పేట బ్రాంచి మేనేజరు ఎం.హైందవి, 20వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఆర్.ఎన్.ఆర్ నాగేశ్వరరావు, బ్యాంకు రీజనల్, బ్రాంచ్ సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి : నూజివీడు డీఎస్పీ

పెదవేగి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకెళ్తే పోలీస్ స్టేషన్‌లో సగం సమస్యల పరిష్కారం తేలికవుతుందని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీప్రసాద్ అన్నారు. పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టేషన్ రైటర్ల మూడురోజుల శిక్షణ కార్యక్రమం రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన రైటర్ల విధి, విధానాలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. డీటీసీ డీఎస్పీ సీహెచ్‌జీవీ.ప్రసాద్ మాట్లాడుతూ స్టేషన్‌లో రైటర్ల పాత్ర కీలకమన్నారు. వారికి ఆధునిక విధానాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన రీతిలో విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో మెత్తం 36 మంది రైటర్లకు మూడురోజుల పాటు విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్త లపై శిక్షణ ఇస్తున్నామన్నారు. డీటీసీ సీఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న కేంద్ర కార్మిక సంఘాల నిరసన

ఏలూరుకార్పొరేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు నిధులు ఎక్కువగా కేటాయించాలని కోరుతూ ఫిబ్రవరి 5న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్ఫూర్తిభవనంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కమిటీ సమావేశానికి రెడ్డి శ్రీనివాసడాంగే అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ సమస్యల పరిష్కారంలో వైఫల్యం చెందాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు మాట్లాడారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, నాయకులు తొర్లపాటి బాబు, పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి కృషి


బాధిత కుటుంబానికి చెక్ అందిస్తున్న సర్పంచ్, టీడీపీ నేతలు

ద్వారకాతిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని సర్పంచ్ దేవరపల్లి నరసమ్మదేవి రాయుడుబాబు అన్నారు. క్షీరబంధు పథకానికి అర్హుడైన ఓ పాడి రైతుకు రాజుపాలెంలో బుధవారం కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మంజూరైన రూ.50వేలును ఆయన అందజేశారు. గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు పోస్తున్న దాసరి పెద్దింట్లు మృతిచెందిన కారణంగా ఏడాదికి 180 లీటర్లను 180 రోజుల కాలంలో మూడేళ్లపాటు పోసి మృతి చెందినందుకు ఈ పథకం వర్తించిందన్నారు. డీపీ చౌదరి, టీడీపీ నేత దేవరపల్లి హేమంత్, మానికల వేములయ్య, మానవర్తి శ్రీరాములు, కృష్ణామిల్క్ యూనియన్ మేనేజర్ మూర్తి, నరేష్ పాల్గొన్నారు.

'భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి'

దెందులూరు/పెదపాడు, జనవరి 29 : రైతులు తమ భూములకు భూసార పరీక్షలు చేయించి అవసరమైన ఎరువులను వాడాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు ఫణికుమార్, నాగేంద్రబాబు అన్నారు, బుధవారం పోతునూరు రైతుసేవ కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. పోతునూరు, ఉంద్రాజవరం, కేతవరం గ్రామాల్లోని వరి పంటలను వారు పరిశీలించారు. టీడీపీ నాయకులు బోడేటి మోహన్, నున్న లక్ష్మణ్, గండి రాజా, బాయి రాంప్రసాద్, లంక అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారులు అనిత, ఐశ్వర్య, సిబ్బంది పాల్గొన్నారు. పెదపాడు మండలం నాయుడుగూడెం, గోగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో వి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మినుము, పెసర వంటి అపరాల సాగు చేస్తున్న రైతులు చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కినేని కృష్ణమోహన్, తుమ్మల గోపాలకృష్ణ, వీఏఏలు అంజలి, మహేష్ పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపారు. వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణం సూరపురాజు కాలనీకి చెందిన తాడికొండ రేణుక, విజయవాడకు చెందిన తాడికొండ సత్యమోహన్ ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నం, కేజీ వెండి, 18 కాసుల బంగారం కట్నంగా ఇచ్చారన్నారు. కొంతకాలం కాపురం సజావుగా సాగిన తరవాత సత్యమోహన్ అదనపు కట్నం తీసుకు రమ్మని భార్య రేణుకను వేధిస్తున్నాడన్నారు. ఈ విషయంపై ఆమె తల్లిదండ్రులు అల్లుడితో మాట్లాడగా మరో రూ.10 లక్షలు కట్నం ఇస్తేనే కాపురం చేస్తానని చెప్పాడన్నారు. ఈమేరకు అతడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు అతడికి సహకరించే మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

పెదవేగి, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేద్కర్ తెలిపారు. వేగివాడ, చక్రాయగూడెం, కె.కన్నాపురం, చల్లచింతలపూడి గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వేహస్ కాఫీపొడి ఫ్యాక్టరీతోపాటు పెదవేగి, సూర్యారావుపేట, కవ్వగుంట, వంగూరు లక్ష్మీపురం, ఎంఆర్‌సీ కాలనీ, గార్లమడుగు, వెంకటకృష్ణాపురం, జగన్నాధపురం, కూచింపూడి, న్యాయంపల్లి, రామశింగవరం గ్రామాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కోకో గింజల దొంగలు హల్‌చల్

ఏలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో కోకో గింజల దొంగలు చెలరేగిపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కోకో గింజల ధర క్వింటా రూ.70 వేలు ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుంటున్నారు. మంగళవారం రాత్రి లక్కవరానికి చెందిన రైతు గురజాల శ్రీనివాస్ తన ఇంటి బయట ఆరబెట్టిన రెండు క్వింటాళ్ళ కోకో గింజలను ఎత్తుకుపోయారు. అక్కడే పచ్చిగా ఉన్న కోకో గింజలను తీసుకు వెళ్లలేదు. ఇరవై రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన పెన్నాడ వెంకటేశ్వరరావు అనే రైతు తన పొలంలో మూటలు కట్టి ఉంచిన మూడు క్వింటాళ్ళ కోకో గింజలను తస్కరించారు. ఇవే కాకుండా అనేక మంది రైతులకు చెందిన కోకో గింజలను కూడా అపహరించినట్టు తెలిసింది. ఇప్పటివరకు రైతులెవరూ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో దొంగలపై పోలీసులు నిఘా పెట్టలేకపోయారు. వీటిని తరలించడానికి ఏదో ఒక వాహనం ఉపయోగించి ఉంటారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ వరుస దొంగతనాలపై గురువారం పలువురు రైతులు లక్కవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ఇంటర్వ్యూ..

ఈ ఏడాది రూ.18.50 కోట్ల ఉపాధి పనులు చేయించాం



సిరిగిబత్తిన దశరథరాంజీ
ఉపాధి హామీ పథకం, ఏపీవో, ఏలూరు

- **ఈ ఏడాది ఉపాధి హామీ పథకం లక్ష్యం ఎంత ?**

జవాబు : దెందులూరు మండలంలో ప్రభుత్వం నుంచి రూ.25 కోట్లకు అనుమతులు తీసుకున్నాం.. ఇప్పటివరకు రూ.18 కోట్ల 50 లక్షల వరకు పనులు చేయించాం

- **కుటుంబానికి ఎన్నిపని దినాలు ?**

జవాబు : పని కోరిన వారందరికి పని కల్పిస్తాం, ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజుల పని కల్పిస్తున్నాం.

- **ఉపాధి పథకం ద్వారా వేతనం ఎంత ?**

జవాబు : కనీసం రూ.300 రోజు వేతనం అందిస్తున్నాం. పని చేస్తే మరింత అందించడం జరుగుతుంది.

- **ఉపాధి పథకంలో ఏఏ పనులు చేస్తున్నారు ?**

జవాబు : రైతులు నీరు నిల్వ చేసుకునేందుకు గుంతలు, ఉద్యానవన పంటలు మల్బరి తదితర పంటలకు పనులు చేసుకునే వారికి అవకాశం కల్పిస్తున్నాం.

- **మినీ గోకులం ఎన్ని మంజూరయ్యాయి ?**

జవాబు : మండలం మొత్తం మీద 40 మీనిగోకులం మంజూరయ్యాయి. యూనిట్ రూ.2 లక్షల 30 వేలు వాటిలో ఇప్పటికి 20 పూర్తయ్యాయి.

- దెందులూరు

ఎమ్మార్పీఎస్ దెందులూరు అధ్యక్షుడిగా జాన్

పెదవేగి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా జొన్నకూటి జాన్ మాదిగను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ ఆదేశాలిచ్చారు. యర్రా ఆనంద్‌ను నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా, పెదవేగి మండల అధ్యక్షుడిగా ఉప్పులూరి ఎలీషా, ఉపాధ్యక్షుడిగా చలపాటి నాగరాజును ఎంపిక చేస్తూ ఉత్తర్వులు అందించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ ఆదేశాలతో ఈ కమిటీ నియామకం జరిగిందని జొన్నకూటి జాన్ తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న బాలోత్సవం కమిటీ

బాలోత్సవం కైకరం విద్యార్థులకు అభినందనలు

ఉంగుటూరు,జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఈనెల 24, 25న జరిగిన బాలోత్సవంలో కైకరం విద్యార్థులకు పలు పురస్కారాలు లభించాయి. పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు సత్తా చాటారు. బాలికల విభాగంలో తెలుగు కథా రచన, చిత్రలేఖనం, సందేశాత్మక గీతాలాపన బృందం, సోలో సందేశాత్మక గీతాలు, నృత్యంలో ప్రతిభ చాటారు. బుధవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు, తెలుగు టీచర్ కె.రాజకుమారి తదితరులు అభినందించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

లింగపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా పీఎస్ఎన్ ప్రసాద్, డాక్టర్ ప్రియాంక అన్నారు. ధర్మాజీగూడెం పీహెచ్‌సీ పరిధిలోగల కలరాయన గూడెంలో ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంకతో కలిసి పర్యటించారు. వారు మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రతిరోజూ గ్రామాలలో పర్యటించాలని, అన్ని గ్రామాల్లో శానిటేషన్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీహెచ్‌వో రామ్మోహన్, పద్మజ, పార్థసారథి, వరలక్ష్మి, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహణ అభినందనీయం

ఏలూరు/చింతలపూడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 31న ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని జంగారెడ్డిగూడెం ఉప్పలమెట్ట కపుల్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఉప్పలమెట్ట వద్ద పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, కపుల్స్ క్లబ్ సభ్యులు ఇమ్మడి బాల భాస్కర్, ఓలేటి కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. చింతలపూడిలో ఈనెల 31న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక వీకేఎం ఫంక్షన్ హాలులో పూజలు నిర్వహి స్తామని పట్టణ ఆర్యవైశ్య అధ్యక్ష, కార్యదర్శులు వజ్రపు శేఖర్, కొనకళ్ళ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

నూజివీడులో సమస్యల తిష్ఠ

దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలు కాలంతో పాటే పెరుగుతున్నాయి. పట్టణంలో జనాభా పెరిగినా, ఆ స్థాయిలో మౌలికసదుపాయాలు కల్పనమాత్రం పెరగటం లేదు. పారిశుధ్యం సమస్య, అస్తవ్యస్త రహదారులు, సేదతీరేందుకు అందుబాటులో లేని పార్క్‌లు, రహదారులు, ప్రభుత్వస్థలాల ఆక్రమణ ఇలా అనేక సమస్యలు నూజివీడులో నెలకొన్నాయి. ప్రాధాన్యత క్రమంలో ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వెళితే నూజివీడు పట్టణాన్ని స్మార్ట్‌టౌన్‌గా మార్చవచ్చు. ఇందుకు స్థానికుల నుంచి అధికారుల వరకు ఒక ప్రణాళిక బద్ధమైనటువంటి ఆచరణ అవసరం ఎంతైనా ఉంది అంటూ అక్షరమే అండగా పరిష్కారం అజెండాగా సదస్సులో పలువురు సూచించారు.

- (నూజివీడు టౌన్, ఆంధ్రజ్యోతి)

పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి



రెవెన్యూ డివిజన్ కేంద్రం, మున్సిపాల్టీ అయిన కనీస మౌలికసదుపాయాల్లో మాత్రం నూజివీడు పట్టణం వెనుకబడి ఉంది. చుట్టు పక్కల గ్రామాలు, మండలాల నుంచి అనేక మంది ఇక్కడకు రాకపోకలు సాగిస్తున్నారు. పబ్లిక్ టాయ్‌లెట్లు లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రధానంగా మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

- ఎం.నాగరాణి, నూజివీడు

చెరువు ఆక్రమణలు తొలగించాలి



నూజివీడు నియోజకవర్గంలోని అతి పెద్దచెరువు నూజివీడు పెద్ద చెరువు. దాదాపు దశాబ్దాలుగా చెరువు ఆక్రమణలకు గురికావడంతో పాటు నిర్వహణ కొరవడడంతో చెరువు కట్టలు బలహీనమై గత భారీ వర్షాల్లో గండిపడి వరదలు సంభవించాయి. హైడ్రా తరహాలో నూజివీడులో చెరువుల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి.

-టి.రాజు, నూజివీడు

డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



ఉమ్మడి ఏపీలో మోడల్‌కాలనీగా ప్రారంభమైన ఎమ్మార్ అప్పారావుకాలనీలో నేటికి పక్కా డ్రెయినేజి వ్యవస్థ ఏర్పాటు కాలేదు. ఫలితంగా రోడ్లపైనే మురుగునీరు నిలుస్తోంది. కాలనీలో పక్కా డ్రెయినేజి వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

- ఆర్.నారాయణ, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

రహదారి మరమ్మతులు చేపట్టాలి



నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్ నుంచి బైపాస్‌రోడ్డు వరకు గత పెద్దచెరువు వరదల్లో రహదారి దెబ్బతిని, తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రహదారి మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలి.

- ఎం.సతీష్, వెలమపేట, నూజివీడు

మురుగునీటి నిర్వహణ చేపట్టాలి



నూజివీడు పట్టణంలోని మురుగునీరు నిర్వహణ సమర్ధవంతంగా చేపట్టాలి. మురుగునీరు దాదాపుగా పట్టణంలోని పెద్దచెరువు, మొగలిచెరువువైపు వెళుతోంది. చెరువులకు మురుగు చేరకుండా చర్యలు చేపడితే మంచినీటి చెరువులుగా మార్చవచ్చు. తద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులతో సమస్య పరిష్కరించవచ్చు.

- బుద్ధవరపు శ్రీనివాసరావు, నూజివీడు

పారిశుధ్యం అధ్వానం



నూజివీడు పట్టణంలోని అంతర్గత రహదారులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా వివిధ వార్డుల్లో అంతర్గత రహదారులపై పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎవరైనా అడిగినప్పుడు మాత్రం పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపడుతున్నారు. ప్రతిరోజూ పనులను చేపట్టాలి.

- తురకా అఖిలాష్, నూజివీడు

క్రీడాస్థలాలను అందుబాటులోకి తేవాలి



నూజివీడు పట్టణంలో క్రీడాస్థలాలతో పాటు వాకింగ్ ట్రాక్‌లను అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. పట్టణంలో మొత్తం నాలుగు క్రీడా ప్రాంగణాలున్నా అవి అలంకారంగానే మారాయి. ప్రభుత్వాలు మారుతున్నా వాటి తలరాత మాత్రం మారటం లేదు. చేయాలి.

- కడియాల సతీష్, నూజివీడు

హమ్మయ్య..కూల్చేశారు !

శిథిలమైన ఓవర్ హెడ్ ట్యాంకుకు మోక్షం

ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందించి తొలగించిన అధికారులు



కలిదిండి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదలంకలో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను బుధవారం తొలగించారు. 'ఆంధ్రజ్యోతి'లో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ శీర్షికన కథనాలను ప్రచురించడంతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు, కార్యదర్శి సురేష్‌ల ఆధ్వర్యంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను యుద్ధ తొలగించారు. ఈ ట్యాంక్ పక్కనే జడ్పీ హైస్కూల్ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. ట్యాంక్‌ను తొలగించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.టీడీపీ నాయకులు దున్న భోగేశ్వరరావు, డి.రామారావు, కోకా రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్, వంశీ, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వేళాయె..

మాఘమాసం ఎప్పుడొస్తుందో.. ఎదురు చూపులు ఫలించేలా మంచి ముహూర్తాలతో నేటి నుంచి మాఘ మాసం ఆరంభం కానుంది. వస్తూనే మంచి ముహూర్తాలు కూడా తెచ్చింది. ఈ నెల 31న మంచి ముహూర్తమని పండితులు చెబుతున్నారు. ఈ నెలలో 9 బలమైన ముహూర్తాలున్నాయి.

ద్వారకాతిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో ముఖ్య ఘట్టం పెళ్లి. అటువంటి పెళ్లి ఎప్పుడు చేసుకోవాలంటే ఎవరైనా ఠక్కున చెప్పేది మాఘమాసం పెళ్లిళ్లకు మాఘమాసం ప్రత్యేకం. ఈమాసంలో ఉన్న బలమైన ముహూర్తాలు మరే మాసంలో ఉండవని పండితులు, పురోహితులు చెబుతున్నారు. అందుకే మాఘమాసానికి అందరూ అంతటి ప్రాధాన్యం ఇస్తారు. ఈ మాసంలో బలమైన ముహూర్తాలలో పెళ్లిళ్లు చేసుకుంటే దాంపత్య జీవితం నిండు నూరేళ్ల పాటు సుఖ, సంతోషాలతో ఉంటుందని పురోహితులు చెబుతున్నారు. బలమైన ముహూర్తాలు ఈ మాసం ప్రారంభం నుంచి ఉన్నాయి.

నేటి నుంచి మాఘమాసం ప్రారంభమై వచ్చే నెల 28తో ముగియనుంది.. రాష్ట్ర వ్యాప్తంగా పెళ్లి సందడి సంతరించుకుంది,. ఈ మాఘమాసంలో ఏకంగా 9 మంచి ముహూర్తాలు ఉండటంతో వేలాది జంటలు మాంగల్య బంధంతో ఒక్కటి కానున్నారు. జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రమైన చినవెంకన్న ఆలయం ఇందుకు ముస్తాబవుతోంది. పెళ్లివారు వివాహ వేడుకలకు సిద్ధమౌతుండగా.. కల్యాణమండప యజమానులు, పురోహితులు, కేటరింగ్, పూల మండపాలు.. ప్రతీ వారూ ఎవరి పనిలో వారు బిజీగా అయ్యారు. ఇప్పటికే దేవస్థానం, ప్రైవేటు కల్యాణమండపాలు, గదులు దాదాపు బుక్ అయ్యాయి. కల్యాణ మండపాలను అలంకరించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. పూల మండపాల అలంకరణ లక్షల్లో పలుకుతున్నాయి. కాటరింగ్, పురోహితులు, షామియానా, కార్ ట్రావెల్స్ వంటి వాటి ధరలకు రెక్కలొచ్చాయి.



ముహూర్తాలివీ..

వివాహాలకు అత్యంత బలమైన ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెల 31, ఫిబ్రవరి 2, 7, 8, 14, 15, 18, 20, 21, 22, 23 వరకూ మంచి ముహూర్తాలున్నాయిని పురోహితులు చెబుతున్నారు. క్షేత్రంలో జరిగే పెళ్లిళ్లకు దాదాపు అన్ని సత్రాలు, కాటేజీలు, రూములు ఎప్పుడో బుక్ అయ్యాయని, ముందు జాగ్రత్తలు లేనివారికి ఈ మాసంలో ఆయా రోజుల్లో పెళ్లిళ్ల చేయడం కష్టమవుతుందని చెబుతున్నారు.

మాఘమాస విశిష్టత

ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే అత్యంత పవిత్రమైన మాసం. పౌర్ణమి నాడు చంద్రుడు మఖ నక్షత్రంలో సంచరించడం వల్ల దీనిని మాఘమాసం అంటారు. మాఘం అంటే పాపాలను పోగొట్టేది అని అర్థం. కార్తీక స్నానానికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో మాఘ స్నానానికి అంతే ప్రాముఖ్యత ఉంటుంది. ఎన్నో శుభకార్యాలకు అనువైనది. సూర్యారాధన ఎంతో ముఖ్యమైనదిగా చెబుతారు.

11 ముహూర్తాలు



ఈ మాఘంలో వివాహాలకు 11 మంచి ముహూర్తాలు ఉన్నాయి. అన్ని నక్షత్రాల వారికి తగిన బలమైన ముహూర్తాలు వచ్చాయి. ఆ తరువాత వచ్చే ఫాల్గుణమాసం శూన్య మాసం. వివాహాలు అంతంతమాత్రంగా జరుగుతాయి. ఆ తర్వాత మార్చి 18 నుంచి 28 వరకూ గురు మౌఢ్యమి కారణంగా పెళ్లిళ్ల జరుగవు. ఏప్రిల్ 2 నుంచి చైత్రమాసంలో మరల పెళ్లిళ్ల ప్రారంభమవుతాయి.

గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, పురోహితుడు, ద్వారకాతిరుమల

చిగురుకోట రహదారికి మోక్షం



అభివృద్ధి చేసిన చిగురుకోట రోడ్డు

ముదినేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక మరమ్మతుల ప్యాకేజీలో భాగంగా ముదినేపల్లి మండలం చిగురుకోట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఏళ్ల తరబడి గోతుల మయంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతుల అనంతరం నూతన కళను సంతరించు కుంది. వడలి - తాడినాడ ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు గోతులను పూడ్పించి మరమ్మతులు చేశారు. దీంతో ఆయా గామాల ప్రజలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మినుము పంటలో సస్యరక్షణ అవసరం



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖాధికారి విద్యాసాగర్

కలిదిండి/ముదినేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మినుము పంట సాగు చేసే రైతులు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వ హించారు. మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే తెగుళ్ల సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయ అధి కారుల సూచనల మేరకు మందులు పిచికారి చేయాలని, సకాలంలో నీరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధి కారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం దేవపూడి, చిగురుకోట గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వెంకటమణి, మండల ఏవో వేణుమాధవ్, సచివాలయాల వ్యవసాయ సహాయకులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తెగుళ్ల నివారణపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై పురుగు మందులను ఆమె అందజేశారు.

ఆక్వామందుల దుకాణాల్లో తనిఖీలు

కైకలూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆక్వా మందుల దుకాణంలో పశువుల మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్టు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అలి తెలిపారు. బుధవారం కైకలూరు మండలంలోని ఆటపాక, వదర్లపాడు బ్రాంచి వద్ద ఆక్వా మందుల దుకాణాలపై మత్స్యశాఖ, ఎంపెడ డ్రగ్ అధికారులు ఆక్వా మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆటపాకలోని ఓ షాపులో పశువులకు వినియోగించే మందులను అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. వదర్లపాడు బ్రాంచి వద్ద కోస్టల్ ఆక్వా అధారిటీ అనుమతులు లేని మందులను గుర్తించారు. అలాగే ఓ దుకాణానికి డ్రగ్ లైసెన్స్, మత్స్యశాఖ అనుమతులు లేకుండా దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆక్వారంగంలో నిషేధిత యాంటీబయోటిక్స్‌ను వినియోగిస్తే చట్టరీత్యా నేరమని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ప్రతీ దుకాణానికి మత్స్యశాఖ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపెడ జాయింట్ టెక్నీషియన్ అధికారి దుర్గారావు, మత్స్యశాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, భవిత రాజేష్ పాల్గొన్నారు.

అధికారికంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవంపై హర్షం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కైకలూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టడం హర్షణీయమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి అన్నారు.బుధవారం కైకలూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ నెల 31న అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టడమే గాక పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ప్రభుత్వపరంగా చేపడతామని ప్రకటించారని ఈ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నమాట ప్రకారం ప్రభుత్వమే నిర్వహిస్తుందని అందుకు రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నెల 31వ తేదిన కైకలూరు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేషపూజలు నిర్వహిస్తామని భక్తులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కె.కె.బాబు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జవ్వాజి గంగరాజు, మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ, బాలకృష్ణ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కింశెట్టి మోహన్, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ ఛైర్మన్ చొప్పర్ల మురళీ కృష్ణ, మాజీ ఛైర్మన్ చిట్టూరి సత్యనారాయణ, ట్రెజరర్ సమయమంతుల రాజా, చెక్కా పూర్ణ, కంతేటి వెంకటరత్నం, ఆచంట వినయ్, కొల్లూరి కాశీ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నరసింహారావు

ముదినేపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం దివాళ తీయించిందని కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు విమర్శిం చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో చేసిన అప్పుల కారణంగా వేల కోట్ల రూపాయల వడ్డీలు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు, గ్రామ సచివాలయాలు, వైసీపీ రంగులు, భూముల సర్వే, జగన్ బొమ్మల ముద్రణ వంటి కారణాలతో కోట్లాది రూపాయల ప్రజాధనం దోపిడీ చేశారని నరసింహారావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పశువుల ఆరోగ్య శిబిరాలు

కలిదిండి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురం, మట్టగుంట గ్రామాల్లో బుధవారం ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 120 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. 300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం, మట్టగుంట గ్రామ సర్పంచ్‌లు గూడవల్లి శ్రీనివాసరావు, అంద్రాజు రత్నమణి, పశువైద్యాధికారులు ప్రహర్ష పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త తొలగింపు

కైకలూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కైకలూరు ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కాలువల్లోని చెత్త తొలగింపు పనులకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు మన్నె శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కైకలూరు పంటకాలువలోని చెత్త తొలగింపు పనులను జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం కూలీలతో ప్రారంభించారు.



మాట్లాడుతున్న మెప్మా సీఎంఎంఎల్ నాగోజి

పట్టణంలో స్మార్ట్‌స్ట్రీట్‌ల ఏర్పాటు

నూజివీడు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో స్మార్ట్‌స్ట్రీట్‌లను ఏర్పాటుచేసి చిన్న తరహా వ్యాపారులను ప్రోత్సహించే దిశగా మెప్మా చర్యలు చేపడుతోందని సీఎంఎంఎల్.నాగోజి అన్నారు. నూజివీడు మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల ఆర్పీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టణపరిధిలో దాదాపు 60 దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మెప్మా నిర్ణయించిందన్నారు. ఇందుకు సంబంధించి కంటైనర్‌లను ఏర్పాటుచేసి ఒక్కో కంటైనర్‌లో మూడు షాపులను నిర్దేశించడం జరిగిందన్నారు. దుకాణాలు పెట్టాలనుకునే వారు మెప్మా కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన ఆర్పీలకు సూచించారు. టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు కె.ఉదయశ్రీ, కోశాధికారి జి.అఖిల, సెక్రటరి ముత్యాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు

మునునూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు ఆశించిందని, అరికట్టకపోతే నష్టం కలుగుతుందని ఏవో కేసీహెచ్.సూరిబాబు అన్నారు. గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ కత్తెర పురుగు తొలిదశలో ఉన్నప్పుడు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య వివరించారు. ఏఈవో బి.రామకృష్ణనాయక్, వీహెచ్‌ఏ సంధ్యారాణి, వీఏఏ ఎస్‌శైలజ, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చికి ఇటుకలు అందజేత

నూజివీడు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో ఆర్‌సీఎం ప్రార్థనా మందిర నిర్మాణానికి మంత్రి కొలుసు పార్థసారధి ఇటుకలను ఇస్తానని హామీ ఇచ్చారు. సుమారు రూ.40వేలు విలువచేసే ఇటుకలను బుధవారం ఆయన పంపించారు. ఉప సర్పంచ్ చలసాని గోపా లక్ష్మణ్, ఆలూరి పూర్ణచంద్రరావు, వీరమాచినేని సత్యనారాయణ, యాదాల సత్యనారాయణ, చలసాని కిరణ్, బత్తుల మాధవరావు చర్చి నిర్వాహకులకు ఇటుకలను అందించారు.



గుడిపాడులో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మంత్రి చొరవతో పంటలకు సాగునీరు

మునునూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మిలేరు పరివాహక గ్రామాల్లో పంటలు నీరులేక ఎండిపోతున్న నేపథ్యంలో మంత్రి కొలుసు పార్థసారధి చొరవతో నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. లోపూడి, గుడిపాడు, గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో వ్యవసాయ బోర్ల నుంచి సమృద్ధిగా నీరు రాకపోవడంతో సుమారు వెయ్యి ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు సమస్యలను మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. మంకొల్లు ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ నుంచి రెండురోజుల క్రితం అధికారులు నీరు విడుదల చేయడంతో బుధవారం ఏటి కాలువ ద్వారా నాలుగు గ్రామాల చెరువులకు నీరు చేరుతోంది. రైతుల సమస్యపై స్పందించి మంత్రి పార్థసారధికి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి నిర్మాణానికి భూమిచ్చిన గ్రామస్థులు



కార్యదర్శి నాగబాబుకు పత్రాలను అందజేస్తున్న స్థానికులు

మునునూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట గ్రామ పంచాయితీలో కుమ్మరివారి బజారులో దీర్ఘకాలంగా ఉన్న డ్రెయినేజీ, రహదారి నిర్మాణ సమస్య పరిష్కారం కానుంది. డ్రెయినేజీ, రహదారి నిర్మాణం కోసం స్థానికులు 20 మంది సుమారు 15 సెంట్లు భూమిని గ్రామ పంచాయితీకి ఇస్తున్నట్లు లిఖితపూర్వకంగా రాశారు. సంబంధిత పత్రాలను బుధవారం టీడీపీ యువనేత రంగు శ్రీనివాసరావు, వల్లూరి సతీష్ కార్యదర్శి పి.నాగబాబుకు అందజేశారు.

ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన డీసీహెచ్ వైద్యబృందం

నూజివీడు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గర్భిణి, తల్లీపిల్లల సంరక్షణలకు సంబంధించి నూజివీడు ఏరియా ఆసుపత్రిని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ సెక్రటరీ హెల్త్ అధికారుల బృందం ఏరియా ఆసుపత్రిని పరిశీలించింది. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.సిరి నేతృత్వంలోని అధికారులు ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, హైరిస్క్ కేసులను ఏవిధంగా పరీక్షలు నిర్వహిస్తున్నారో అనే అంశాలను ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్ జేడీ రత్నావళి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పందిరి కూరగాయల పంటల పరిశీలన

మునునూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న సామాజిక తనిఖీల్లో భాగంగా పలు గ్రామాల్లో ఉద్యానవన శాఖ ద్వారా రైతులు సాగు చేసిన శాశ్వత కూరగాయల పందిరి పంటలను జిల్లా ఉద్యానవన అధికారి ఎస్.రామ్మోహన్ పరిశీలించారు. చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి గ్రామాల్లో పందిరి సాగుతోపాటు బొప్పాయి, పామాయిల్ పంటలు, కలెక్షన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. పంటల రాబడిపై రైతుల నుంచి వివరాలను సేకరించారు. బొప్పాయి, పందిరి కూరగాయల సాగుతో పాటు ఇతర పండ్ల తోటల యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై ఆయన రైతులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారిణి కె.జ్యోతి ప్రియాంక, రైతుసేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

మునునూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా జరుగుతున్న రీసర్వేను బుధవారం తహసీల్దార్ పరిశీలించారు. ప్రభుత్వ భూములను పూర్తిస్థాయిలో గుర్తించి, సరిహద్దులను నిర్ణయించాలని, రైతు భూముల హద్దులు, విస్తీర్ణం నిబంధనల ప్రకారం సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ఉత్తమ సేవలను అందించాలన్నారు. వీఆర్వో హరిబాబు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి గోటితో తలంబ్రాలు

చాట్రాయి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అపర భద్రాద్రి చనుబండ శ్రీకోదండరామ స్వామి దేవస్థానంలో ఏప్రిల్ 6న జరిగే సీతారామ కల్యాణోత్సవాలకు ధాన్యాన్ని గోటితో వలిచి తలంబ్రాలు తయారు చేయడానికి భక్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులకు ధాన్యం అందజేస్తామని, వాటిని ఇంటికి తీసుకువెళ్ళి నియమనిష్టలతో గోటితో వలిచి తిరిగి మార్చి 25లోగా దేవస్థానానికి అప్పగించాలన్నారు

సోలార్ రూఫ్ టాప్‌ను ప్రోత్సహించాలి

చాట్రాయి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వెలుగు సిబ్బందికి అవగాహన కల్పించారు. మహిళలకు ఈ పథకంపై అవగాహన కల్పించి ప్రతి ఇంటిపై రాయితీతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయించాలని అధికారులు సూచించారు. ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ సోలార్ విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వ రాయితీ వివరించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీ విష్ణు పాల్గొన్నారు.

తెలుగు రైతు నాయకుడు జగదీశ్‌కు మాతృ వియోగం



సరోజిని(ఫైల్)

చాట్రాయి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి మందలపు జగదీశ్ తల్లి సరోజిని(75) బుధవారం కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వివిధ గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు సరోజిని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.